Follow: @ANNTELUGU

12-09-2026

ANN తెలుగు

# మహా పత్రిక

శనివారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 234 పేజీలు-08 వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM

## మెరిసిన నిధి

- రాయలసీమ జెనెక్స్ స్టార్ టీమ్ తో ఫొటో షూట్
- ఉమెన్ ఏపీఎల్ టీమ్ బ్రాండ్ అంబాసిడర్ గా స్టార్ హీరోయిన్
- నేడు కడపలో జెర్సీ లాంచ్

ఉమెన్ ఆంధ్రాప్రీమియర్ లీగ్ ఆసక్తిని కలిగిస్తోంది. ఈ టోర్నీలో భారత్ క్రికెట్ జట్టు ప్లేయర్లు ఉన్న హాట్ ఫేవరెట్ రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టుకు ప్రముఖ నటి, పాన్ ఇండియా హీరోయిన్ నిధి అగర్వాల్ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తుండగా, శనివారం కడపలో రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టు జెర్సీ లాంచ్ కు ఆమె హాజరుకానున్నారు. ఏఎన్ఎన్ ఛానెల్ లో నిధి అగర్వాల్ అతిథిగా హాజరయ్యే జెర్సీ లాంచ్ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. శ్రేయాస్ మీడియా ఈ ఈవెంట్ ఏర్పాట్లు చేస్తోంది.

04



టాప్ న్యూస్

టెక్నాలజీ రంగంలోనే
## భవిష్యత్ పోరాటాలు



- భారత్ ఐటీ, ఏఐలో ముందడుగు
- రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్.

03

## ఏఎంఆర్ గ్రూప్‌పై ఈడీ దాడులు



- హైదరాబాద్‌లో మహేష్‌రెడ్డి నివాసం, కార్యాలయాల్లో సోదాలు
- హైదరాబాద్‌తో పాటు కోల్‌కతా, చెన్నై, బెంగళూరులో ఏకకాలంలో తనిఖీలు.

02

పేదలకు ఏడాదిలోగా
## ఇళ్ల పట్టాలు



- కలెక్టర్లకు చంద్రబాబు కీలక ఆదేశాలు.
- ప్రభుత్వ భూమి లేకపోతే ప్రైవేట్ భూమి కొనైనా ఇవ్వండి.
- రోజుకు 2 వేల ఇళ్లు పూర్తి చేయాలి.
- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

03




## జనగణనలో ఓబీసీ కాలమ్ కోసం తెలంగాణలో గళం

- అసెంబ్లీలో తీర్మానానికి డిమాండ్.
- ఓబీసీలకు ప్రత్యేక గుర్తింపు లేకుంటే బీసీ జనాభా లెక్కలు ఎలా తేలుతాయి?
- 130 కులాల్లో 90కే కేంద్ర జాబితాలో చోటు.
- మిగిలిన 40 కులాలను చేర్చిన తర్వాతే గణన చేపట్టాలని డిమాండ్.

హైదరాబాద్, మహా : 2027 జనగణనలో ఓబీసీలకు ప్రత్యేకంగా గుర్తింపు ఇచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని తెలంగాణలో డిమాండ్ బలపడుతోంది. జనగణనలో ఎస్సీ, ఎస్టీల మాదిరిగా

మిగతా 2వ పేజీలో



## కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు

- తెలంగాణలో ప్రజా సమస్యలపై పోరాటం.
- ఆస్ట్రేలియాలో పార్టీ విస్తరణపై విస్తృత చర్చ.
- కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లే కార్యాచరణపై కేటీఆర్‌తో నాగేందర్ రెడ్డి చర్చ.

హైదరాబాద్, మహా: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు కాసర్ల నాగేందర్ రెడ్డి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తున్న పాలన, ప్రజలకు ఇచ్చిన హామీల అమలు,

మిగతా 2వ పేజీలో

# అసెంబ్లీలో రేవంత్ మార్క్



### ఆందోళనలకు పాలనతోనే సమాధానం

ఐదో రోజుకు చేరిన సమావేశాలు
బీఆర్ఎస్ నిరసనల మధ్య ప్రజా సమస్యలపై ప్రభుత్వ ఫోకస్

**హైదరాబాద్, మహా:**
తెలంగాణ శాసనసభ వర్షాకాల సమావేశాలు ఐదో రోజుకు చేరుకున్న వేళ రాష్ట్ర రాజకీయాల్లో అసెంబ్లీ కేంద్రంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బీఆర్ఎస్ నిరసనలు, సస్పెన్షన్లు, స్పీకర్‌పై వ్యాఖ్యల వివాదం, ఎర్రవెల్లి ఘటన, 22ఏ భూముల అంశం.. ఇలా వరుస పరిణామాలతో సభలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. మరోవైపు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి మాత్రం కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని సమన్వయం చేస్తూ ప్రజా సమస్యలను సభలో ప్రస్తావించడంపై ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్షం ఆందోళనలతో రాజకీయ ఒత్తిడి పెంచుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తన పాలనా కార్యక్రమాలను సభా వేదికగా వివరించే ప్రయత్నం చేస్తోంది. సెప్టెంబర్ 7న ప్రారంభమైన సమావేశాల్లో తొలి రోజుల్లోనే బీఆర్ఎస్ సభ్యుల నిరసనలు ఉద్రిక్తతకు దారితీశాయి. పోలీసుల వ్యవహారశైలిపై చర్చకు బీఆర్ఎస్ పట్టుబట్టగా, అనంతరం ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రం వద్ద జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఘటనపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. సభా కార్యకలాపాలకు పదేపదే అంతరాయం కలిగిందన్న కారణంతో బీఆర్ఎస్‌కు చెందిన 22 మంది ఎమ్మెల్యేలను సమావేశాల

మిగతా 2వ పేజీలో





ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో
## బ్రిక్స్‌దే కీలక పాత్ర

**ప్రపంచ జీడీపీ కంటే రెట్టింపు వేగంతో బ్రిక్స్ ఆర్థిక వృద్ధి**

ఆవిష్కరణలు, వాణిజ్యంపై మరింత సహకారానికి పిలుపు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, మహా:** ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం క్రమంగా పెరుగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. శుక్రవారం న్యూఢిల్లీలో జరిగిన బ్రిక్స్ వ్యాపార వేదిక నాయకుల సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో బ్రిక్స్ దేశాలు మరింత సమన్వయంతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం బ్రిక్స్ దేశాలు ప్రపంచ జనాభాలో సుమారు 50 శాతం, ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 25 శాతానికి పైగా వాటాను కలిగి ఉన్నాయని తెలిపారు.గత కొన్నేళ్లలో ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి సుమారు రెండున్నర రెట్లు పెరిగితే.. అదే కాలంలో బ్రిక్స్ దేశాల ఉమ్మడి స్థూల దేశీయోత్పత్తి దాదాపు నాలుగున్నర రెట్లు విస్తరించిందని మోదీ వివరించారు. ప్రపంచంలోని

మిగతా 2వ పేజీలో

## యూరియాకే రాయితీతో భూసారం దెబ్బతింటోంది

- ఎరువుల రాయితీ విధానాన్ని మార్చాలి
- చౌకగా ఉందని యూరియానే వేస్తున్నారు.
- సమతుల్య ఎరువుల వాడకాన్ని ప్రోత్సహించాలి
- కేంద్రానికి మంత్రి తుమ్మల లేఖ.

02



**హైదరాబాద్, మహా:**
యూరియాపై అధిక రాయితీ, ఇతర ఎరువులపై తక్కువ రాయితీ కారణంగా రైతులు చౌకగా లభించే యూరియాను అధికంగా వినియోగిస్తున్నారని, దీనివల్ల భూసారం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రానికి సూచించారు. భూమి ఆరోగ్యాన్ని కాపాడే విధంగా అన్ని రకాల ఎరువుల ధరలు, రాయితీ విధానాన్ని హేతుబద్ధీకరించాలని కోరారు. సమతుల్య ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం విధానపరమైన మార్పులు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటూ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖకు మంగళవారం లేఖ రాశారు.ప్రస్తుతం యూరియా ధర ఇతర ఎరువులతో పోలిస్తే భారీగా

మిగతా 2వ పేజీలో

## దేశమంతా బ్యారియర్ లేని టోల్ బూత్‌లు



ఆగకుండా టోల్ చెల్లింపు

02

వాహనం దూసుకెళ్తున్నా క్షణాల్లో రుసుము వసూలు

జాతీయ రహదారులపై సరికొత్త ప్రయాణ అనుభవం

## సుమంత్ జీవితమే సర్వ నాశన మైంది



- కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ భార్య
- 20 రోజులుగా మా కుటుంబం పై తీవ్ర ఒత్తిడి
- ఒత్తిడి తట్టుకోలేక మా మామయ్య ఆత్మహత్యాయత్నం
- ప్రస్తుతం వెంటిలేటర్ పై చికిత్స.. పరిస్థితి విషమం

03

59 వేల గుడిసె కుటుంబాలకు
## ఇందిరమ్మ ఇళ్లు

**గుడిసెలు లేని తెలంగాణగా మారుస్తాం**

03

అసెంబ్లీలో మంత్రి పొంగులేటి ప్రకటన



**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని గుడిసెల్లో నివసిస్తున్న 59 వేల కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. పేదల జీవనాధారానికి దూరంగా ఇళ్లు నిర్మించి వారిని 30-40 కిలోమీటర్లు తరలించే విధానం తమ ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు వీలైనంత సమీపంలోనే ఇళ్ల నిర్మాణానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు మనోహర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, అక్బరుద్దీన్ ఓవైసీ తదితరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి

మిగతా 3వ పేజీలో

# ఏఎంఆర్ గ్రూప్‌పై ఈడీ దాడులు

**హైదరాబాద్, మహా .** ఎస్‌ఆర్‌ఈఐ సంస్థల రుణాల వ్యవహారంలో మనీలాండరింగ్ ఆరోపణలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దేశవ్యాప్తంగా చేపట్టిన సోదాలు హైదరాబాద్‌లోనూ కలకలం రేపాయి. ఏఎంఆర్/ఏఎంఆర్‌ఎల్ గ్రూప్‌కు చెందిన కార్యాలయాలు, సంబంధిత ప్రాంగణాల్లో శుక్రవారం ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. శ్రీనగర్ కాలనీలోని ఏఎంఆర్ గ్రూప్ ప్రమోటర్ ఎ. మహేశ్‌రెడ్డికి సంబంధించిన నివాసం, కార్యాలయాల్లోనూ సోదాలు కొనసాగినట్లు అధికారులు వెల్లడించారు. ఎస్‌ఆర్‌ఈఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్ లిమిటెడ్, ఎస్‌ఆర్‌ఈఐ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ లిమిటెడ్ నుంచి తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న రుణాలు తిరిగి చెల్లించకపోవడం, నిధుల మళ్లింపు, రుణాలను ఇతర లావాదేవీల ద్వారా కొనసాగించినట్లు భావిస్తున్న 'ఎవర్‌గ్రీనింగ్', రౌండ్ ట్రిప్పింగ్ తదితర ఆర్థిక అవకతవకలపై ఈ దర్యాప్తు సాగుతున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. ఇవన్నీ దర్యాప్తులోని ఆరోపణలు మాత్రమేనని, తుది బాధ్యత లేదా నేరం కోర్టు నిర్ధారణకు లోబడి ఉంటుందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. కోల్‌కతాలో నమోదైన కేసు ఆధారంగా అక్కడి ఈడీ బృందం హైదరాబాద్‌కు చేరుకుని ఈ సోదాలు చేపట్టినట్లు సమాచారం. ఏఎంఆర్/ఏఎంఆర్‌ఎల్ గ్రూప్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు, రుణ పత్రాలు, సంస్థల మధ్య జరిగిన లావాదేవీలకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నివాస, కార్యాలయ ప్రాంగణాల్లో లభించిన పత్రాలతో పాటు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ఇతర డిజిటల్ పరికరాల్లోని సమాచారాన్ని కూడా అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. హైదరాబాద్‌తో పాటు కోల్‌కతా, చెన్నై, బెంగళూరులోనూ ఏకకాలంలో ఈడీ బృందాలు సోదాలు నిర్వహించాయి. ఒడిశాకు చెందిన ఏఆర్‌ఎస్‌ఎస్ గ్రూప్ ప్రమోటర్ల కుటుంబ సభ్యులకు సంబంధించిన ప్రాంగణాలతో పాటు ఏఎంఆర్/ఏఎంఆర్‌ఎల్ గ్రూప్ ప్రమోటర్ మహేశ్ కుమార్ రెడ్డికి అనుబంధంగా ఉన్న ప్రాంతాల్లోనూ ఈ తనిఖీలు జరిగాయని అధికారులు తెలిపారు. రుణాల మంజూరు నుంచి వాటి వినియోగం, తిరిగి చెల్లింపుల వరకు జరిగిన ఆర్థిక లావాదేవీలను దర్యాప్తు సంస్థ పరిశీలిస్తోంది. ఎస్‌ఆర్‌ఈఐ సంస్థలతో ఏఎంఆర్ గ్రూప్‌కు గతంలో ఉన్న ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన అంశాలు కూడా ఇప్పటికే పలు నియంత్రణ సంస్థల రికార్డుల్లో నమోదయ్యాయి. సెబీకి సంబంధించిన గత న్యాయపరమైన పత్రాల్లో ఎస్‌ఆర్‌ఈఐ ఎక్విప్‌మెంట్ ఫైనాన్స్ నుంచి ఏఎంఆర్ గ్రూప్‌కు చెందిన సంస్థకు రుణం, అనంతరం ఆ రుణ పరిష్కారానికి సంబంధించిన లావాదేవీల వివరాలు ప్రస్తావించబడ్డాయి.అదేవిధంగా 2026లో వెలువడిన ఒక న్యాయపరమైన ఉత్తర్వులోనూ ఎస్‌ఆర్‌ఈఐ నుంచి ఏఎంఆర్‌కు సంబంధించిన రుణ ఖాతాల వర్గీకరణ, వాటిని ఎన్‌పీఏగా పరిగణించిన విధానం తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ నేపథ్యంలో తాజా ఈడీ సోదాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. అయితే ప్రస్తుత సోదాల్లో ఏ మేరకు పత్రాలు లేదా డిజిటల్ ఆధారాలు స్వాధీనం చేసుకున్నారన్న దానిపై అధికారికంగా పూర్తి వివరాలు వెలువడాల్సి ఉంది.ఏఎంఆర్ గ్రూప్ మౌలిక వసతులు, నిర్మాణం, మైనింగ్ తదితర రంగాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. గ్రూప్ వ్యవహారాలకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల్లో ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగిందా? రుణ నిధులు నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించబడ్డాయా? నిధుల మళ్లింపు లేదా రౌండ్ ట్రిప్పింగ్ జరిగిందా? అనే అంశాలను ఈడీ దర్యాప్తులో తేల్చే అవకాశం ఉంది. మహేశ్‌రెడ్డి వ్యాపార రంగంతో పాటు సినీ నిర్మాణ రంగంలోనూ పరిచితుడు. నాగార్జున కథానాయకుడిగా నటించిన 'శిరిడీ సాయి', 'ఓం నమో వేంకటేశాయ' చిత్రాలను ఆయన నిర్మించారు. వ్యాపార, సినీ రంగాల్లో గుర్తింపు ఉన్న వ్యక్తికి సంబంధించిన సంస్థలపై మనీలాండరింగ్ కోణంలో ఈడీ సోదాలు జరగడం హైదరాబాద్‌లో చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం కొనసాగుతున్న సోదాల్లో ఈడీ అధికారులు సేకరించే పత్రాలు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీల వివరాల ఆధారంగా తదుపరి చర్యలు ఉండే అవకాశం ఉంది. దర్యాప్తు పూర్తయ్యే వరకు రుణాల ఎగవేత, నిధుల మళ్లింపు, రౌండ్ ట్రిప్పింగ్ వంటి అంశాలను ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుంది. దర్యాప్తులో బయటపడే ఆధారాల ఆధారంగానే ఈ వ్యవహారంలో తదుపరి పరిణామాలు స్పష్టమయ్యే అవకాశం ఉంది.

# అసెంబ్లీలో రేవంత్ మార్క్

( మొదటి పేజీ తరువాయి )

మిగిలిన కాలానికి సస్పెండ్ చేశారు. ఈ నిర్ణయాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తూ గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేసింది.

**స్పీకర్ అంశంతో మరింత ముదిరిన వివాదం**

స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలు సభలో మరో వివాదానికి దారితీశాయి. ఈ వ్యాఖ్యలతో స్పీకర్ భావోద్వేగానికి గురైన దృశ్యాలు రాజకీయంగా చర్చనీయాంశమయ్యాయి. బీఆర్ఎస్ మాత్రం ఆరోపణలను ఖండిస్తూ తమ వైఖరిని వివరిస్తోంది. ఈ వ్యవహారంపై పోలీసులకు ఫిర్యాదులు అందడంతోపాటు దర్యాప్తు అంశం కూడా ముందుకు వచ్చింది.ఈ పరిణామంపై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చట్టపరమైన ప్రక్రియకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతోంది. శాసనసభలో రాజకీయ విభేదాలు సహజమే అయినప్పటికీ స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధమైన పదవుల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్న అభిప్రాయాన్ని అధికార పక్షం వ్యక్తం చేస్తోంది.

**ఎర్రవెల్లి ఘటనపై విచారణ.. మూడు కేసులు నమోదు**

మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రం సమీపంలో దళిత కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన చేపట్టిన అనంతరం కొందరు బీఆర్ఎస్ మద్దతుదారులు పసుపు నీరు, పాలు చల్లి ప్రాంతాన్ని 'శుద్ధి' చేశారన్న ఆరోపణలు తీవ్ర రాజకీయ దుమారం రేపాయి. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమగ్ర విచారణకు ఆదేశించారు. తాజాగా ఈ వ్యవహారానికి సంబంధించి పోలీసులు 3 కేసులు నమోదు చేసినట్లు సమాచారం.ఈ అంశంలో ప్రభుత్వం తీసుకున్న వైఖరి ఇప్పుడు రాజకీయంగా కీలకంగా మారింది. ఆరోపణలు ఏ వర్గం నుంచి వచ్చినా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రభుత్వం చెబుతోంది. అయితే బీఆర్ఎస్ మాత్రం ఈ ఆరోపణలను రాజకీయంగా ఖండిస్తూ, ఘటనకు సంబంధించిన కొన్ని ఆధారాలు కృత్రిమంగా రూపొందించినవని ఆరోపిస్తోంది. దీంతో దర్యాప్తులో వాస్తవాలు ఏ మేరకు వెలుగులోకి వస్తాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

**22ఏపై ప్రతిపక్షం ఒత్తిడి**

సమావేశాల్లో 22ఏ భూముల అంశం కూడా కీలకంగా మారింది. నిషేధిత జాబితాలో పేదలు, రైతులకు సంబంధించిన భూములు చేరాయని బీఆర్ఎస్ ఆరోపిస్తూ చర్చకు పట్టుబడుతోంది. శాసనమండలిలోనూ ఈ అంశంపై చర్చకు అనుమతించాలంటూ బీఆర్ఎస్ సభ్యులు పట్టుబట్టి వాకౌట్ చేశారు. ఇదే సమయంలో తస్సెరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు భూమి కేటాయింపుపై కూడా బీఆర్ఎస్ మండలిలో చర్చకు డిమాండ్ చేసింది. ప్రభుత్వ భూమి కేటాయింపులో ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులకు ప్రయోజనం కల్పించారంటూ బీఆర్ఎస్ ఆరోపణలు చేసింది. ప్రభుత్వం మాత్రం ఈ ఆరోపణలను రాజకీయ ఆరోపణలుగా చూస్తోంది. ఈ అంశంపై అధికారిక సమాధానాలు, సంబంధిత పత్రాలు సభ ముందు రావాల్సి ఉంది.



**సీఎల్పీలో రేవంత్ దిశానిర్దేశం**

సభలో ప్రతిపక్షంతో తలపడటంతో పాటు ప్రభుత్వం తన పని తాను కొనసాగించాలన్న దిశలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలకు సూచనలు చేశారు. ప్రతి ఎమ్మెల్యే సభకు హాజరై తన నియోజకవర్గానికి సంబంధించిన సమస్యలను ప్రస్తావించాలని, చర్చల్లో చురుగ్గా పాల్గొనాలని ఆదేశించారు. ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను పూర్తి చేసిన నేపథ్యంలో ప్రజలకు ఇచ్చిన బాధ్యతను మరింత సమర్థంగా నిర్వర్తించాలని కోరారు.ప్రతిపక్షం సభా కార్యకలాపాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తోందని రేవంత్‌రెడ్డి విమర్శించినప్పటికీ, అధికార పక్షం కూడా సభా సమయాన్ని ప్రజా సమస్యల చర్చకు వినియోగించుకోవాల్సిన బాధ్యతను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు నియోజకవర్గ సమస్యలపై గట్టిగా మాట్లాడాలని సీఎం సూచించడం సభా వ్యూహంలో కీలకమైన అంశంగా మారింది.

**ఐదో రోజు.. అభివృద్ధి, ఉపాధి అంశాలపై దృష్టి**

సెప్టెంబర్ 11న సమావేశాలు ఐదో రోజుకు చేరుకోవడంతో రాజకీయ వివాదాలతో పాటు అభివృద్ధి, ఉపాధి, విద్య, సంక్షేమానికి సంబంధించిన అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ వెలుపల సమాచార సాంకేతిక రంగాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.నిజామాబాద్ వంటి రెండో శ్రేణి నగరాల్లో సమాచార సాంకేతిక సంస్థలను తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. ప్రముఖ సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పడం ద్వారా హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సమాచార సాంకేతిక అభివృద్ధిని ఇతర జిల్లాలకు విస్తరించే ప్రభుత్వ లక్ష్యం స్పష్టమైంది.ఇక విద్యార్థుల ఫీజు బకాయిలు, దివ్యాంగుల సంక్షేమం, వ్యవసాయం, పెట్టుబడులు, ఉపాధి వంటి అంశాలు కూడా సమావేశాల్లో ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దీంతో రాజకీయ వివాదాల మధ్య కూడా ప్రజలకు నేరుగా సంబంధించిన అంశాలను సభా చర్చల్లో కొనసాగించాల్సిన అవసరం అధికార పక్షంపై ఉంది.

**ప్రతిపక్షం దూకుడు.. ప్రభుత్వానికి రాజకీయ పరీక్ష**

వెయ్యి రోజుల పాలనను లక్ష్యంగా చేసుకుని బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, రైతులు, యువత, మహిళలు, భూములు, సంక్షేమం వంటి అంశాలపై కాంగ్రెస్‌ను ప్రశ్నిస్తోంది. మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం తాను అమలు చేసిన కార్యక్రమాలు, తీసుకున్న నిర్ణయాలను ప్రజల ముందు ఉంచుతోంది.బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్ అనంతరం ఆ పార్టీ సభ వెలుపల పోరాటాన్ని విస్తరించాలని నిర్ణయించింది. మహిళా నేతలపై పోలీసుల వ్యవహారశైలిపై జాతీయ మహిళా కమిషన్, జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాలని కూడా బీఆర్ఎస్ నిర్ణయించింది.దీంతో అసెంబ్లీ వేదికగా మొదలైన రాజకీయ పోరు ఇప్పుడు సభ వెలుపలకూ విస్తరిస్తోంది. అధికార పక్షానికి ఇది రాజకీయంగా సవాల్ కాగా, అదే సమయంలో ప్రభుత్వం తన పాలనా పనితీరును ప్రజలకు మరింత స్పష్టంగా వివరించాల్సిన అవకాశంగా కూడా మారింది.

**రేవంత్ ముందున్న అసలు పరీక్ష ఇదే**

ఐదు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో రాజకీయంగా తీవ్ర పరిణామాలు చోటుచేసుకున్నాయి. స్పీకర్ వివాదం, ఎర్రవెల్లి ఘటన, బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, 22ఏ భూముల అంశం, తస్సెరాక్ట్ భూమి కేటాయింపు ఆరోపణలు.. ఒక్కొక్కటి ప్రభుత్వానికి రాజకీయంగా కొత్త సవాల్‌ను విసిరాయి.అయితే ఈ మొత్తం పరిణామాల్లో రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి కీలకమైన పరీక్ష ఒక్కటే— సభలో రాజకీయ వేడిని ప్రజా సమస్యల పరిష్కారంగా ఎంతవరకు మలుస్తుందన్నది. ప్రతిపక్షం ఆరోపణలు చేస్తే ప్రభుత్వం వాస్తవాలతో సమాధానం ఇవ్వాలి. సమస్యలు లేవనెత్తితే పరిష్కార మార్గాన్ని చూపాలి. ఆరోపణలు వస్తే దర్యాప్తు జరిపి నిజానిజాలను తేల్చాలి. అదే సమయంలో తన పాలనా ఫలితాలను ప్రజల ముందుంచాలి.అసెంబ్లీ ఐదో రోజుకు చేరుకున్న తరుణంలో తెలంగాణ రాజకీయాల్లో పోరు మరింత ముదిరినప్పటికీ.. రాజకీయ ఘర్షణల మధ్య పాలనను ముందుకు తీసుకెళ్లడం, సభా సమయాన్ని ప్రజా ప్రయోజనాలకు వినియోగించడం, ఆరోపణలకు చట్టపరమైన విచారణతో సమాధానం ఇవ్వడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి ఇప్పుడు అత్యంత కీలకమైన బాధ్యతగా మారింది. ఈ సమావేశాలు ముగిసే నాటికి ప్రభుత్వం ఏ అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకుంటుందన్నదే తదుపరి రాజకీయ పరిణామాలకు దిశానిర్దేశం చేయనుంది.

# దేశమంతా బ్యారియర్ లేని టోల్ బూత్‌లు



**ముంబై, మహా :** జాతీయ రహదారులపై టోల్ చెల్లింపులో మరో కీలక మార్పు రానుంది. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలోని అన్ని జాతీయ రహదారుల టోల్ కేంద్రాలను బ్యారియర్ లేని విధానంలోకి తీసుకురానున్నట్లు కేంద్ర రహదారులు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. ముంబైలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సాంకేతిక సదస్సులో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న బహుళ వరుసల నిరంతర టోల్ వసూలు విధానాన్ని దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు తెలిపారు.డిసెంబర్ 2026 నాటికి సుమారు 70 శాతం టోల్ కేంద్రాలను బ్యారియర్ రహితంగా మార్చాలని, మార్చి 2027 నాటికి 100 శాతం టోల్ కేంద్రాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు గడ్కరీ తెలిపారు. వాహనాలు టోల్ కేంద్రాల వద్ద ఆగాల్సిన అవసరం లేకుండా ప్రయాణిస్తూనే టోల్ రుసుము ఆటోమేటిక్‌గా వసూలయ్యేలా వ్యవస్థను రూపొందిస్తున్నారు. గుజరాత్‌లోని సూరత్-భరూచ్ జాతీయ రహదారిపై దేశంలో తొలి బహుళ వరుసల నిరంతర టోల్ వసూలు విధానాన్ని ఇప్పటికే ప్రారంభించారు.

**వేగంగా వెళ్తున్నా టోల్ కట్**

కొత్త విధానంలో వాహనాల నంబరు పలకలను గుర్తించే కెమెరాలతో పాటు ఫాస్ట్‌ట్యాగ్ సాంకేతికతను ఉపయోగించనున్నారు. వాహనం టోల్ కేంద్రం వద్ద ఆగకుండా వెళ్లిపోయినా దాని నంబరు పలక, ఫాస్ట్‌ట్యాగ్ వివరాలను గుర్తించి సంబంధిత ఖాతా నుంచి రుసుము వసూలు చేస్తారు. దీంతో టోల్ కేంద్రాల వద్ద వాహనాల బారులు, వేచి ఉండే సమయం, ఇంధన వృథా గణనీయంగా తగ్గనున్నాయి. ప్రస్తుతం జాతీయ రహదారులపై టోల్ వసూళ్లలో 98 శాతానికి పైగా ఫాస్ట్‌ట్యాగ్ ద్వారా జరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2025 డిసెంబర్ నాటికి దేశవ్యాప్తంగా 11.86 కోట్ల ఫాస్ట్‌ట్యాగ్‌లు జారీ అయ్యాయి. దీంతో నగదు చెల్లింపులు, టోల్ కేంద్రాల వద్ద మానవ జోక్యం, వాహనాల నిరీక్షణ గణనీయంగా తగ్గాయి. ఫాస్ట్‌ట్యాగ్ అమలుతో టోల్ వసూళ్లలో పారదర్శకత పెరిగిందని గడ్కరీ తెలిపారు. కొత్త బ్యారియర్ రహిత విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే టోల్ వసూళ్లు మరింత సమర్థంగా జరుగుతాయని, ప్రభుత్వ ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉందన్నారు. టోల్ వసూలు వ్యవస్థను కేవలం రుసుము చెల్లించే విధానంగా కాకుండా దేశవ్యాప్త డిజిటల్ రవాణా మౌలిక వసతుల్లో భాగంగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు.

**వేచి ఉండే సమయానికి తెర**

ఫాస్ట్‌ట్యాగ్ అమలుతో ఇప్పటికే టోల్ కేంద్రాల వద్ద వాహనాల నిరీక్షణ సమయం భారీగా తగ్గిందని కేంద్రం తెలిపింది. బ్యారియర్ రహిత విధానం అమలులోకి వస్తే వాహనాలు టోల్ కేంద్రాల వద్ద ఆగకుండా నేరుగా వెళ్లిపోవడంతో రహదారులపై రద్దీ మరింత తగ్గనుంది. దీనివల్ల ఇంధన వినియోగం, ప్రయాణ సమయం, వాహన నిర్వహణ వ్యయాల్లోనూ ఆదా సాధ్యమవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఏడాది ప్రయాణానికి ప్రత్యేక పాస్**

ప్రైవేటు కార్లు, జీపులు, వ్యాన్ల కోసం ఫాస్ట్‌ట్యాగ్ ఆధారిత వార్షిక పాస్ కూడా అందుబాటులో ఉంది. 2026-27 ఆర్థిక సంవత్సరానికి దీని రుసుము రూ.3,075గా నిర్ణయించారు. ఒక సంవత్సరం లేదా 200 టోల్ కేంద్రాల ప్రయాణాలు.. ఏది ముందుగా పూర్తయితే అది వర్తిస్తుంది. జాతీయ రహదారులు, జాతీయ రహదారి మార్గాల్లోని నిర్దేశిత టోల్ కేంద్రాల్లో ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చు.ఫాస్ట్‌ట్యాగ్ ఆధారిత వార్షిక పాస్‌కు వాహనదారుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. కేంద్ర గణాంకాల ప్రకారం 2026 జూన్ నాటికి 77 లక్షలకు పైగా వార్షిక పాస్‌లు జారీ అయ్యాయి. ఈ పాస్ ద్వారా జాతీయ రహదారుల టోల్ కేంద్రాల్లో 63 కోట్లకు పైగా లావాదేవీలు నమోదయ్యాయి.

# జనగణనలో ఓబీసీ కాలమ్ కోసం తెలంగాణలో గళం

( మొదటి పేజీ తరువాయి )

వెనుకబడిన తరగతుల కులాల వివరాలను కూడా స్పష్టంగా నమోదు చేయాలని బీసీ సంఘాలు, జేఏసీలు కోరుతున్నాయి. ఓబీసీల వివరాల నమోదుకు స్పష్టమైన కాలమ్ లేదా ముందుగా గుర్తించిన అధికారిక కులాల జాబితా ఉండాలని, ఈ అంశంపై తెలంగాణ శాసనసభలో మరోసారి తీర్మానం చేసి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ వినిపిస్తోంది.2027 జనగణనలో కులగణనను చేపట్టాలని కేంద్రం ఇప్పటికే నిర్ణయించింది. తెలంగాణలో గృహ జాబితా, గృహ గణన ప్రక్రియ మే 11 నుంచి జూన్ 9 వరకు నిర్వహించనున్నట్లు గతంలో కేంద్ర జనగణన అధికారులు వెల్లడించారు. తెలంగాణలో 2027 జనగణన ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకోనుంది. స్వాతంత్ర్యం తర్వాత దేశవ్యాప్తంగా తొలిసారిగా సమగ్ర కుల వివరాల సేకరణకు కేంద్రం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో, కులాల గుర్తింపు, నమోదు విధానం కీలకంగా మారింది.అయితే జనగణనలో వెనుకబడిన తరగతుల వివరాలను ఏ విధంగా నమోదు చేస్తారన్న అంశంపై ఇప్పుడు చర్చ మొదలైంది. ప్రాథమిక గృహ జాబితా ప్రశ్నావళిలో కుటుంబ పెద్ద ఎస్సీ, ఎస్టీ లేదా ఇతర వర్గానికి చెందినవారా అనే అంశానికి చోటు ఉన్నప్పటికీ, ఓబీసీలను ప్రత్యేకంగా గుర్తించే విధానం ఉండకపోవడంపై బీసీ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. రెండో దశ జనాభా లెక్కల్లో కుల వివరాలను సేకరించే సమయంలో కూడా ఓబీసీలకు స్పష్టమైన, ప్రమాణీకృత విధానం ఉండాలని వారు కోరుతున్నారు.తెలంగాణ బీసీ కమిషన్ ఇప్పటికే ఈ అంశంపై కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ ప్రకారం తెలంగాణలో 130 కులాలు బీసీలుగా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందగా, కేంద్ర ఓబీసీ జాబితాలో ప్రస్తుతం 90 కులాలకే చోటు ఉంది. మిగిలిన 40 కులాలు కేంద్ర జాబితాలో లేకుండానే జనగణన జరిగితే, ఆ వర్గాల జనాభా అధికారిక లెక్కల్లో సరిగా ప్రతిబింబించకపోవచ్చన్న ఆందోళన వ్యక్తమవుతోంది. అందువల్ల మిగిలిన 40 కులాలను కేంద్ర ఓబీసీ జాబితాలో చేర్చిన తర్వాతే జనగణన ప్రక్రియను చేపట్టాలని కమిషన్ కోరింది.

# యూరియాకే రాయితీతో భూసారం దెబ్బతింటోంది

( మొదటి పేజీ తరువాయి )

తక్కువగా ఉండటంతో రైతులు సహజంగానే దాని వైపు మొగ్గు చూపుతున్నారని మంత్రి తన లేఖలో వివరించారు. 45 కిలోల యూరియా బస్తా సుమారు రూ.240-266కే లభిస్తుండగా, 50 కిలోల డీఏపీ బస్తా రూ.1,350, 19:19:19 కాంప్లెక్స్ ఎరువు సుమారు రూ.1,750గా ఉందని పేర్కొన్నారు. ధరలో ఇంతటి వ్యత్యాసం ఉన్నప్పుడు రైతులు ఇతర పోషకాల కంటే యూరియాకే ప్రాధాన్యం ఇవ్వడం సహజమని తెలిపారు.

కేంద్ర ప్రభుత్వ వివరాల ప్రకారం 45 కిలోల యూరియా బస్తాకు చట్టబద్ధంగా నిర్ణయించిన గరిష్ఠ చిల్లర ధర రూ.242గా ఉంది. మరోవైపు ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులకు పోషకాల ఆధారిత రాయితీ విధానం అమల్లో ఉంది. ఈ రెండు విధానాల మధ్య ఉన్న ధరల వ్యత్యాసం ఎరువుల వినియోగ తీరుపై ప్రభావం చూపుతోందన్న అంశాన్ని తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లింది.

తెలంగాణలో యూరియా వినియోగం కూడా గణనీయంగా పెరిగిందని తుమ్మల పేర్కొన్నారు. 2015-16లో రాష్ట్రంలో సుమారు 14 లక్షల టన్నులుగా ఉన్న యూరియా వినియోగం 2025-26 నాటికి 20.7 లక్షల టన్నులకు చేరిందని తెలిపారు. యూరియా వినియోగం పెరుగుతున్న కొద్దీ నేలలో నైట్రోజన్ అధికంగా చేరడం, ఇతర ప్రధాన, సూక్ష్మ పోషకాల మధ్య సమతుల్యత దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.పంటలకు అవసరమైన నైట్రోజన్, ఫాస్ఫరస్, పొటాషియం మధ్య సమతుల్యత ఉండాల్సిన అవసరాన్ని మంత్రి ప్రస్తావించారు. సాధారణంగా సూచించే ఎన్‌పీకే నిష్పత్తి 4:2:1గా ఉండగా, తెలంగాణ నేలల్లో ప్రస్తుతం 12.6:4.8:1గా ఉందని పేర్కొన్నారు. అంటే నైట్రోజన్, ఫాస్ఫరస్ వినియోగం అధికంగా ఉండగా, జింక్, బోరాన్ వంటి సూక్ష్మపోషకాల లోపం ఏర్పడుతోందని తెలిపారు. దీని ప్రభావంగా పంటల్లో తెగుళ్లు, ఇతర సమస్యలు పెరిగే అవకాశం ఉందని వివరించారు.సిఫార్సు చేసిన మోతాదుతో పోలిస్తే రైతులు యూరియాను అధికంగా వినియోగిస్తున్న తీరును కూడా మంత్రి ప్రస్తావించారు. ఒక ఎకరాకు సుమారు 65 కిలోల యూరియా, 35 కిలోల డీఏపీ అవసరమయ్యే పరిస్థితుల్లో కొంతమంది రైతులు 90 నుంచి 135 కిలోల వరకు యూరియాను మాత్రమే వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. చౌకగా లభించే ఎరువుపై అధికంగా ఆధారపడే ఈ విధానం దీర్ఘకాలంలో నేల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని హెచ్చరించారు.అధిక యూరియా వినియోగం కేవలం భూసారానికే పరిమితం కాకుండా పంట నాణ్యతపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని తుమ్మల పేర్కొన్నారు. నాణ్యత తగ్గితే అంతర్జాతీయ మార్కెట్లలో భారత వ్యవసాయ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని కేంద్రాన్ని అప్రమత్తం చేశారు. రైతులకు తక్షణ ప్రయోజనం కలిగించే చౌక ఎరువు విధానంతో పాటు దీర్ఘకాలికంగా భూమి ఆరోగ్యాన్ని కాపాడే విధానం కూడా అవసరమని స్పష్టం చేశారు.

ప్రస్తుతం కేంద్రం యూరియాపై ప్రత్యేక రాయితీ విధానాన్ని అమలు చేస్తుండగా, ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులకు పోషకాల ఆధారిత రాయితీ పద్ధతి అమల్లో ఉంది. 2026లో రాజ్యసభకు కేంద్రం ఇచ్చిన సమాధానం ప్రకారం డీఏపీ, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ, వివిధ కాంప్లెక్స్ ఎరువులు సహా 28 రకాల ఫాస్ఫేటిక్, పొటాషిక్ ఎరువులు పోషకాల ఆధారిత రాయితీ పథకం పరిధిలో ఉన్నాయి.

ఈ నేపథ్యంలో రాయితీ విధానాన్ని కేవలం ఒక రకం ఎరువుకు అనుకూలంగా ఉండే విధంగా కాకుండా, భూమికి అవసరమైన అన్ని పోషకాలను సమతుల్యంగా అందించే విధంగా పునర్వ్యవస్థీకరించాలని తుమ్మల కోరారు. రైతులు ధరల కారణంగా ఒకే రకం ఎరువుపై ఆధారపడకుండా, పంటకు అవసరమైన పోషకాల ఆధారంగా సరైన ఎరువును ఎంచుకునే పరిస్థితి కల్పించాలని సూచించారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉండటంతో పాటు వాటిని సరైన మోతాదులో, సరైన సమయంలో, సమతుల్యంగా వినియోగించేలా వ్యవసాయ శాఖ ద్వారా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే ఎరువుల సరఫరా, పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో, కేంద్ర రాయితీ విధానంలో మార్పులు జరిగితే భూసార పరిరక్షణతో పాటు రైతుల ఉత్పాదకతకు కూడా మేలు జరుగుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

# ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్‌దే కీలక పాత్ర

( మొదటి పేజీ తరువాయి )



ఇతర దేశాలతో పోలిస్తే బ్రిక్స్ ఆర్థిక శక్తి వేగంగా విస్తరిస్తోందని, ఈ పరిణామం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఈ కూటమి ప్రాధాన్యం పెరుగుతున్నదానికి సంకేతమని పేర్కొన్నారు.బ్రిక్స్ దేశాలు కేవలం ఆర్థిక శక్తుల సమూహంగా మాత్రమే కాకుండా.. ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు, సాంకేతిక పరిష్కారాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని మోదీ అన్నారు. అట్టడుగు స్థాయి ప్రజాప్రయోజన కార్యక్రమాల నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు విస్తృత రంగాల్లో కొత్త ఆలోచనలు, ఆవిష్కరణలకు అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం, ఆవిష్కరణలు, నూతన ఆలోచనలకు పెరుగుతున్న ప్రాధాన్యం బ్రిక్స్ దేశాల భవిష్యత్ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తోందని వివరించారు.బ్రిక్స్ దేశాల్లో అభివృద్ధి స్థాయి, ఆర్థిక వృద్ధి వేగం, భవిష్యత్తుపై ఆశావాదం స్పష్టంగా కనిపిస్తున్నాయని మోదీ అన్నారు. ఆర్థిక, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సభ్య దేశాల మధ్య సహకారాన్ని మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. భారత్ అధ్యక్షతన జరుగుతున్న ఈ ఏడాది సమావేశాల ప్రధాన ప్రాధాన్యాలు స్థిరత్వం, ఆవిష్కరణలు, సహకారం, సుస్థిరతపై కేంద్రీకృతమై ఉన్నాయి.భారత్ వేదికగా జరుగుతున్న ఈ సమావేశం ఇప్పటివరకు నిర్వహించిన బ్రిక్స్ వ్యాపార వేదికల్లో అతిపెద్దదని మోదీ పేర్కొన్నారు. వివిధ దేశాలకు చెందిన వ్యాపార, పారిశ్రామిక వర్గాలు ఒకే వేదికపైకి రావడం ద్వారా వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక భాగస్వామ్యం, సరఫరా వ్యవస్థలు వంటి రంగాల్లో కొత్త అవకాశాలకు మార్గం సుగమమవుతుందని అన్నారు. ఈ వేదిక ద్వారా బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేయవచ్చని తెలిపారు.

# కేటీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ ఆస్ట్రేలియా వ్యవస్థాపక అధ్యక్షుడు

( మొదటి పేజీ తరువాయి )

రానున్న రెండేళ్లలో బీఆర్ఎస్ ఆస్ట్రేలియా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న వెయ్యి రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో చోటుచేసుకున్న వైఫల్యాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లే అంశంపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ప్రతిపక్షంగా బీఆర్ఎస్ మరింత క్రియాశీలంగా వ్యవహరిస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో పాటు ప్రజల గొంతుకగా నిలిచేలా చేపట్టాల్సిన కార్యక్రమాలపై కేటీఆర్‌తో నాగేందర్ రెడ్డి చర్చించారు.

ప్రభుత్వ విధానాలు, పాలనా వైఫల్యాలను ప్రజలకు వివరించడంలో సామాజిక మాధ్యమాల పాత్రపై కూడా చర్చించారు. ప్రభుత్వ నిర్ణయాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో పాటు బీఆర్ఎస్ విధానాలు, పార్టీ పోరాటాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఆస్ట్రేలియా బీఆర్ఎస్ చేపట్టనున్న కార్యాచరణపై ఇరువురు నాయకులు చర్చించినట్లు తెలిపారు.

ఆస్ట్రేలియాలో బీఆర్ఎస్ కార్యకలాపాలను మరింత విస్తరించడం, పార్టీ కార్యక్రమాలకు ప్రవాస తెలంగాణవాసుల మద్దతును సమీకరించడం, తెలంగాణ ప్రయోజనాల కోసం సామాజిక, రాజకీయ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించడం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చినట్లు పేర్కొన్నారు. ఆస్ట్రేలియాలోని వివిధ ప్రాంతాల్లో పార్టీ కార్యకలాపాలను మరింత బలోపేతం చేసి, తెలంగాణకు సంబంధించిన అంశాలపై ప్రవాసుల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా కార్యాచరణ రూపొందించాలని నిర్ణయించినట్లు తెలిపారు.

అదేవిధంగా కేటీఆర్ ఆస్ట్రేలియా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలపైనా ఇరువురు చర్చించారు. ఆస్ట్రేలియాలో బీఆర్ఎస్‌ను బలోపేతం చేయడంలో కాసర్ల నాగేందర్ రెడ్డి నాయకత్వంలో పార్టీ శ్రేణులు చేస్తున్న కృషిని కేటీఆర్ అభినందించారు. పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఆస్ట్రేలియాలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న కృషిని ప్రశంసించారు.

రానున్న రోజుల్లో తెలంగాణలో ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేయడంతో పాటు, ఆస్ట్రేలియాలోనూ పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి బీఆర్ఎస్ వాణిని బలంగా వినిపిస్తామని కాసర్ల నాగేందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రజల సమస్యలను ప్రవాస తెలంగాణవాసుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పార్టీ కార్యక్రమాలకు వారి మద్దతును మరింతగా కూడగట్టేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

# ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలి

- ట్రాఫిక్ సమస్య తలేత్తకుండా అధికారులు సమన్వయంతో పని చేయాలి
- తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికంగానే నిమజ్జనం చేసుకోవాలి
- వరంగల్ సీపీ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- నగరంలోని చెరువుల వద్ద గణపతి నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సీపీ, వరంగల్ హన్మకొండ జిల్లాల కలెక్టర్లు



**వరంగల్, బ్యూరో మహా ;** గణపతి విగ్రహాల నిమజ్జనానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నగరంలోని కాజీపేట బంధం చెరువు, హనుమకొండ సిద్దేశ్వర గుండం,చిన్న వడ్డే పల్లి, ఉర్సు చెరువుల వద్ద గణపతి నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్, కలెక్టర్ లు అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా చెరువులు, గుండం వద్ద ఎన్ని వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉందో, గతంలో ఆయా ప్రాంతాల్లో ఎన్ని విగ్రహాలను నిమజ్జనం చేశారని అధికారులను పోలీస్ కమిషనర్, కలెక్టర్లు వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన సందర్భంగా అధికారులతో పలు అంశాల పై సమీక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ శ్వేత, మాట్లాడుతూ... గణపతి నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా సజావుగా జరిగేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిమజ్జన సమయంలో అవసరమైన క్రేన్లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. బంధం చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం చెరువులు, గుండంలో నీటి మట్టం తక్కువగా ఉన్నందున పెద్ద విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన నీటి నిల్వలతో పాటు తగిన ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని అన్నారు. చెరువు కట్ట వద్ద అవసరమైన మేరకు చదును చేసే పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రోడ్లు బాగుండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. విగ్రహాల సంఖ్య, పరిమాణం, నిమజ్జనానికి అవసరమైన సౌకర్యాలపై ముందస్తు అంచనా వేసుకుని తగిన ఏర్పాట్లు చేయాలన్నారు.నిమజ్జనానికి వచ్చే వాహనాల రాకపోకలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలను సమర్థవంతంగా చేపట్టాలని ఆదేశించారు. తక్కువ ఎత్తు ఉన్న విగ్రహాలను స్థానికం గానే నిమజ్జనం చేసుకొనే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు. నవరాత్రులు పూర్తి కాగానే వీలైనంత త్వరగా వినాయకులను కదిలించి... నిమజ్జనానికి తరలించాల న్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దారా కవిత, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ ప్రభాకర్ రావు, జీడబ్ల్యూఎంసీ ఎస్ఈ రవికుమార్, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, డీఎంహెచ్వోలు డాక్టర్ రాజారెడ్డి, అప్పయ్య, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ సామ్య నాయక్, సాగునీటిపారుదల శాఖ అధికారులు కిరణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, జీడబ్ల్యూఎంసీ ఎంహెచ్వో డాక్టర్ రాజేష్, ఆర్అండ్బీ ఈఈ దేవిక చౌహన్, మైనింగ్ ఏడీ రామాచారి, కాజీపేట తహసీల్దార్ రాజు, ఏసీపీలు ప్రశాంత్ రెడ్డి, సత్యనారాయణ, కాజీపేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్యామ్ సుందర్, తదితర అధికారులు పాల్గొన్నారు.

# పేదలకు ఏడాదిలోగా ఇళ్ల పట్టాలు

- కలెక్టర్లకు చంద్రబాబు కీలక ఆదేశాలు.
- ప్రభుత్వ భూమి లేకపోతే ప్రైవేట్ భూమి కొనైనా ఇవ్వండి.
- రోజుకు 2 వేల ఇళ్లు పూర్తి చేయాలి.
- ఏ పి సిఎం చంద్రబాబు నాయుడు.



**అమరావతి, మహా:** రాష్ట్రంలో ఇళ్ల స్థలాలు లేని పేదలకు ఏడాదిలోగా ఇంటి పట్టాలు పంపిణీ చేయాల్సిందేనని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒక్కో కుటుంబానికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్ల చొప్పున స్థలం కేటాయించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమి అందుబాటులో లేకపోతే ప్రైవేట్ భూమిని కొనుగోలు చేసి అయినా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ల సదస్సు రెండో రోజు గృహ నిర్మాణంపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఈ ఏడాది ఇళ్ల స్థలాల కోసం సుమారు 2 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, వారికి స్థలాలు కేటాయించేందుకు దాదాపు 2,051 ఎకరాల భూమి అవసరమని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నేపథ్యంలో స్థలాల గుర్తింపు, భూసేకరణ, పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని చంద్రబాబు ఆదేశించారు. గ్రామాల్లో పేదలకు 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున ఇంటి స్థలం అందించాలని సీఎం స్పష్టం చేశారు. ప్రభుత్వ భూమి లభ్యత లేకపోతే ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ భూమిని కొనుగోలు చేయాలని సూచించారు. అర్హులైన పేద కుటుంబాలు ఇళ్ల స్థలం కోసం సంవత్సరాల తరబడి ఎదురుచూడకుండా నిర్ణీత కాలవ్యవధిలో పట్టాలు అందేలా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాలకు దూరంగా కేవలం సెంటు స్థలం కేటాయించడం వల్ల పేదలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని చంద్రబాబు పేర్కొన్నారు. ఇప్పటికే ఆ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారిని అక్కడే కొనసాగించాలని, అయితే కేటాయించిన స్థలం వద్ద ఇల్లు నిర్మించుకోవడానికి ఆసక్తి లేని వారి పట్టాలను రద్దు చేసి, వారికి మరో ప్రాంతంలో 3 సెంట్ల స్థలం కేటాయించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో భూమి లభ్యత ప్రధాన సమస్యగా ఉన్న చోట ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని సీఎం సూచించారు. భూమి దొరకని ప్రాంతాల్లో టిడ్కో ఇళ్లు లేదా గ్రూప్ హౌసింగ్ విధానంలో పేదలకు గృహ వసతి కల్పించాలని ఆదేశించారు. పట్టణాల్లో భూమి కొరతను అధిగమిస్తూ ఎక్కువ మంది పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేలా ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణంపై సమీక్షలోనూ ముఖ్యమంత్రి కీలక ఆదేశాలు జారీ చేశారు. 2015 నుంచి 2024 మధ్య కాలంలో మంజూరైన 18 లక్షల ఇళ్లలో 7.27 లక్షల ఇళ్లు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మరో 3 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని వివరించారు. టిడ్కో ఇళ్లను కలుపుకొని ఇప్పటివరకు 5.50 లక్షల ఇళ్లలో గృహప్రవేశాలు జరిగినట్లు వెల్లడించారు. ప్రస్తుతం మరో 5.27 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని అధికారులు తెలిపారు. వీటిని వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని సీఎం పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్ల నిర్మాణానికి కేంద్రం గడువును సెప్టెంబర్ 2026 వరకు పొడిగించినందున, ఆలోగా నిర్మాణాలు పూర్తిచేసి కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. రోజుకు కనీసం 2 వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా జిల్లా కలెక్టర్లు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని చంద్రబాబు ఆదేశించారు. నిర్మాణ సామగ్రి, లబ్ధిదారులకు చెల్లింపులు, ఇంజినీరింగ్ సమస్యలు, భూమికి సంబంధించిన ఇబ్బందులు వంటి అంశాలను క్షేత్రస్థాయిలో పరిష్కరించి పనుల వేగాన్ని పెంచాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఒక్కొక్కటిగా పర్యవేక్షిస్తూ లక్ష్యాలను చేరుకోవాలని అధికారులను ఆదేశించారు. డిసెంబర్‌లోపు మరో 4.5 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం తెలిపారు. ఇందుకోసం జిల్లాల వారీగా నిర్మాణ పురోగతిని నిరంతరం సమీక్షించాలని, వెనుకబడిన జిల్లాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పేదల సొంత ఇంటి కలను వేగంగా నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యాల్లో ఒకటని స్పష్టం చేశారు.

## బీఆర్ఎస్.. బీజేపీ దొందు దొందే

**హనుమకొండ, మహా:** బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు దొందు దొందేనని, బీఆర్ఎస్ విధానాలను బీజేపీ అనుసరిస్తోందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి విమర్శించారు. దళిత స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించేలా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యవహరించడం సిగ్గుచేటని, ఇది క్షమించరాని విషయమని మండిపడ్డారు. దళితులపై వివక్ష చూపుతున్న బీఆర్ఎస్ తీరును ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని అన్నారు.హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ఫామ్‌హౌస్ ప్రాంతంలో దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పసుపు నీళ్లతో శుద్ధి చేయడం అనాగరిక చర్యగా అభివర్ణించారు. అంటరానితనాన్ని, మూఢనమ్మకాలను ప్రోత్సహించేలా వ్యవహరించడం దారుణమన్నారు.కేసీఆర్ దళిత ముఖ్యమంత్రి చేస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి మాట తప్పారని ఆరోపించారు. మాదిగ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ రాజయ్యను ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించి అవమానించారని విమర్శించారు. మంత్రివర్గంలో మాదిగలకు తగిన ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు.అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని మార్చుతానన్న వ్యాఖ్యలతో కేసీఆర్ తన వైఖరిని బయటపెట్టుకున్నారని ఆరోపించారు. దళిత సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను చూసి ఓర్వలేక కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీ ఫిరాయింపులకు ప్రోత్సహించారని అన్నారు.

# టెక్నాలజీ రంగంలోనే భవిష్యత్ పోరాటాలు



**న్యూఢిల్లీ, మహా:** ప్రపంచం లోతైన నిర్మాణాత్మక మార్పులకు లోనవుతోందని, రాబోయే కాలంలో దేశాల శక్తి సామర్థ్యాలను నిర్ణయించేది సాంకేతికతేనని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ముఖ్యంగా భారత్ ఐటీ, కృత్రిమ మేధస్సు రంగాల్లో వేగంగా దూసుకెళ్తోందని ప్రశంసించారు. న్యూఢిల్లీలో శుక్రవారం జరిగిన బ్రిక్స్ వాణిజ్య వేదిక సమావేశంలో మాట్లాడిన పుతిన్.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం వేగంగా పెరుగుతోందని పేర్కొన్నారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో జరగనున్న 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశానికి ముందు ఈ వాణిజ్య వేదిక సమావేశం జరిగింది.

భారత్ తమకు కీలక భాగస్వామి అని పుతిన్ అన్నారు. ప్రపంచ సాఫ్ట్‌వేర్ రంగంలో భారత్ గణనీయమైన స్థానం సంపాదించిందని, భారతీయుల ప్రతిభ, విద్యా సామర్థ్యం, ముఖ్యంగా సంకేత భాషా రచనలో వారి నైపుణ్యం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని ప్రశంసించారు. జూన్‌లో సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన అంతర్జాతీయ ఆర్థిక వేదికలో భారత్ ఐటీ రంగంపై తాను చేసిన వ్యాఖ్యలను ఈ సందర్భంగా ఆయన మరోసారి గుర్తుచేశారు.

**భవిష్యత్ పోరాటాలు సాంకేతికతలోనే**

ప్రపంచం ప్రస్తుతం సాధారణ మార్పులకు కాకుండా లోతైన నిర్మాణాత్మక మార్పులకు లోనవుతోందని పుతిన్ అన్నారు. భవిష్యత్తులో దేశాల మధ్య పోటీ, ఆధిపత్య పోరాటం కేవలం సరిహద్దుల వద్ద కాకుండా సాంకేతిక రంగంలో మరింత తీవ్రంగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, అర్ధవాహక చిప్‌లు, క్వాంటమ్ సాంకేతికత, డిజిటల్ వేదికలు వంటి రంగాల్లో స్వావలంబన సాధించడం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. బ్రిక్స్ దేశాలు సాంకేతిక రంగంలో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవాలని పుతిన్ పిలుపునిచ్చారు. ముఖ్యంగా భారత్, రష్యా కలిసి కృత్రిమ మేధస్సు, రోబోటిక్స్, డిజిటల్ సాంకేతికత, అర్ధవాహక చిప్‌లు, క్వాంటమ్ రంగాల్లో పరిశోధన, తయారీ, పెట్టుబడులకు కొత్త అవకాశాలను సృష్టించుకోవాలని సూచించారు. పాశ్చాత్య దేశాల సాంకేతికతపై అధిక ఆధారపడటాన్ని తగ్గించుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఇదే దిశగా వ్యాపార సహకారాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక వాణిజ్య సహకార కమిటీని ఏర్పాటు చేసినట్లు పుతిన్ వెల్లడించారు. పారిశ్రామిక, సాంకేతిక, మౌలిక వసతులు, రవాణా, డిజిటల్ రంగాల్లో పరస్పర పెట్టుబడులు, సంయుక్త ప్రాజెక్టులను పెంచాలని ఆయన ఆకాంక్షించారు. భారత్-రష్యా పారిశ్రామిక సహకారానికి న్యూఢిల్లీలో జరుగుతున్న 'ఇన్నోప్రామ్ ఇండియా' ప్రదర్శన కూడా కీలక వేదికగా నిలిచింది. ఈ ప్రదర్శనలో కృత్రిమ మేధస్సు, అంతరిక్షం, అణుశక్తి, విమానయానం, అధునాతన తయారీ, భారీ పరిశ్రమలు వంటి రంగాలకు చెందిన సాంకేతికతలను ప్రదర్శిస్తున్నారు.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ బలం**

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో బ్రిక్స్ దేశాల ప్రాధాన్యం పెరుగుతోందని పుతిన్ అన్నారు. గత ఐదేళ్లలో ప్రపంచ ఆర్థిక వృద్ధిలో బ్రిక్స్ దేశాల వాటా జీ7 దేశాల కంటే గణనీయంగా ఎక్కువగా ఉందని పేర్కొన్నారు. కొనుగోలు శక్తి సమానత్వం ఆధారంగానూ బ్రిక్స్ దేశాల ఆర్థిక బలం మరింత పెరిగిందని వివరించారు.ప్రస్తుతం బ్రిక్స్‌లో 11 సభ్య దేశాలు ఉన్నాయి. ప్రపంచ జనాభాలో సుమారు 49.5 శాతం, ప్రపంచ స్థూల దేశీయోత్పత్తిలో సుమారు 40 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 26 శాతం వాటాను ఈ దేశాలు కలిగి ఉన్నాయని భారత ప్రభుత్వం వెల్లడించింది. దీంతో ప్రపంచ దక్షిణ దేశాల ఆర్థిక, రాజకీయ ప్రాధాన్యాలను అంతర్జాతీయ వేదికపై ముందుకు తీసుకెళ్లే కీలక వేదికగా బ్రిక్స్ మారుతోంది.

**మోదీ–పుతిన్ భేటీ.. ఇన్నోప్రామ్ సందర్శన**

బ్రిక్స్ సమావేశాల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీతో పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఇంధనం, రక్షణ, వాణిజ్యం, సాంకేతికత, పారిశ్రామిక సహకారం తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చించారు. అనంతరం మోదీ, పుతిన్ కలిసి ఇన్నోప్రామ్ ఇండియా పారిశ్రామిక ప్రదర్శనను సందర్శించారు. భారత్-రష్యా పారిశ్రామిక, సాంకేతిక సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఈ ప్రదర్శనకు ప్రాధాన్యం ఉందని ఇరుదేశాలు పేర్కొన్నాయి.భారత్-రష్యా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 2030 నాటికి 100 బిలియన్ డాలర్లకు పెంచే లక్ష్యంతో ఇరుదేశాలు ముందుకు సాగుతున్నాయి. పారిశ్రామిక తయారీ, సాంకేతికత, కృత్రిమ మేధస్సు, ఇంధనం, కీలక ఖనిజాలు, రక్షణ రంగాల్లో సహకారాన్ని మరింత విస్తరించే దిశగా తాజా చర్చలు సాగాయి.

# నాణ్యమైన సేవలు అందించాలి

**వరంగల్, మహా:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు మరింత నాణ్యమైన సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల పోషణ, ఆరోగ్యం, సంరక్షణపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కలెక్టరేట్ లో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లతో నిర్వహించిన సమీక్షలో కేంద్రాల పనితీరు, మౌలిక వసతులు, లబ్ధిదారులకు అందుతున్న సేవలపై ఆమె సమీక్షించారు. అనంతరం పోషణ మాసం-2026 పోస్టర్లను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 9 నుంచి అక్టోబర్ 8 వరకు జిల్లావ్యాప్తంగా పోషణ మాసం కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. పోషకాహారం, ఆహార వైవిధ్యం, బాలల ఆరోగ్యం, శిశు సంరక్షణ, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. "మన అంగన్‌వాడీ-మన బాధ్యత" సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు.

## 59 వేల గుడిసె కుటుంబాలకు
# ఇందిరమ్మ ఇళ్లు

( మొదటి పేజీ తరువాయి )



సమాధానమిచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తించిన సుమారు 59 వేల గుడిసెల కుటుంబాలను ఇందిరమ్మ ఇళ్ల రెండో విడతలో ప్రాధాన్యతా వర్గంగా పరిగణించనున్నట్లు వెల్లడించారు. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇళ్ల కేటాయింపులు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి రెండో విడతలో 2,000 ఇళ్లను కేటాయించగా, అందులో 500 ఇళ్లను గతంలో నిర్మాణం ప్రారంభమై వివిధ కారణాలతో మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్లకు కేటాయించే విధానం ఉందని ప్రభుత్వం వివరించింది. గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు కూడా రెండో విడతలో ప్రత్యేక ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పేదలను వారి ఉపాధి, జీవనాధారాలకు దూరంగా తరలించడం వల్ల కుటుంబాలపై అదనపు భారం పడుతుందని మంత్రి పేర్కొన్నారు. అందుకే ఇన్‌సిటూ విధానానికి ప్రాధాన్యం ఇస్తున్నామని, సాధ్యమైన చోట్ల వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతానికి 5-8 కిలోమీటర్ల పరిధిలోనే ఇళ్లను నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్ పరిధిలో భూముల ధరలు ఎకరాకు రూ.150 కోట్ల నుంచి రూ.200 కోట్ల వరకు ఉన్న ప్రాంతాల్లోనూ పేదల గౌరవాన్ని కాపాడేలా ఇళ్ల కేటాయింపులు చేపడుతున్నామని పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల ఆర్థిక సాయంపై కూడా మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలో ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షల ఉచిత ఆర్థిక సహాయం అందిస్తున్న రాష్ట్రం మరొకటి లేదని ఆయన పేర్కొన్నారు. నిర్మాణ వ్యయాలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ మొత్తం సరిపోవడం లేదని సభ్యులు సూచించడంతో, సహాయాన్ని పెంచే అంశాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని వెల్లడించారు.రాష్ట్రంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొత్తం 8 లక్షల ఇళ్లను రెండు దశల్లో నిర్మించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. మొదటి దశలో 4.5 లక్షల ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.22,500 కోట్లు, రెండో దశలో 2.5 లక్షల ఇళ్లకు సుమారు రూ.11 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. పట్టణ ప్రాంతాల్లో మరో లక్ష ఇళ్ల నిర్మాణానికి సుమారు రూ.5,500 కోట్లు అవసరమవుతాయని మంత్రి వివరించారు. మొత్తంగా ఈ కార్యక్రమానికి రూ.39 వేల కోట్లకు పైగా రాష్ట్ర ప్రభుత్వం వ్యయం చేయనుంది.ఇదిలా ఉండగా, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్‌లో ప్రయోగాత్మకంగా ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని కూడా చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. 20 నియోజకవర్గాల్లో ఈ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించగా, 16 నియోజకవర్గాల్లో లాటరీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక పూర్తయి భౌతిక ధ్రువీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. వచ్చే ఏడాది బోనాల నాటికి ఇందిరమ్మ టవర్లలో గృహప్రవేశాలు నిర్వహించే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో అసంపూర్తిగా మిగిలిపోయిన 2బీహెచ్‌కే ఇళ్ల నిర్మాణాలు, మౌలిక వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.600 కోట్లకు పైగా ఖర్చు చేసిందని మంత్రి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల్లో సుమారు రూ.750 కోట్లను కూడా చెల్లించినట్లు వెల్లడించారు. నిర్మాణం పునాది, గోడలు లేదా పైకప్పు దశల్లో నిలిచిపోయిన వ్యక్తిగత ఇళ్లను కూడా రెండో విడతలో పూర్తి చేసేందుకు ప్రత్యేక విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు.

# ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టాలి

**వరంగల్ క్రైమ్ మహా ;** వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్రవారం వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్ కు స్టేషన్ ఇన్స్పెక్టర్ మొక్కను అందజేసి స్వాగతం పలకాగా సాయుధ పోలీసులు గౌరవ వందనం చేసారు. అనంతరం పోలీస్ కమిషనర్ సిబ్బంది కిట్ ఆర్టికల్స్ పరిశీలించారు.ఈ సందర్భంగా సీపీ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ లో భాగం పోలీస్ కమిషనర్ పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను పరిశీలించారు. ట్రాఫిక్ పోలీసుల విధుల నిర్వహణ, వాహనాల తనిఖీలు, ట్రాఫిక్ నిబంధనల అమలు, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ప్రమాదాల నివారణ, వాహనదారులు, పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ముఖ్యంగా ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.అలాగే ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పై అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది ప్రజలతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ, సమర్థవంతమైన సేవలను అందించాలని తెలిపారు. స్టేషన్‌లోని రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు, విధుల కేటాయింపు తదితర అంశాలను పరిశీలించిన పోలీస్ కమిషనర్, విధుల్లో మరింత అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు మెరుగైన పోలిసింగ్ సేవలు అందించాలని సీపీ సిబ్బందికి సూచించారు.ఈ తనిఖీలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారాయణ తో ఎస్. ఐలు సిబ్బంది పాల్గొన్నారు.

# సుమంత్ జీవితమే సర్వ నాశన మైంది



**వరంగల్, మహా ;** మాజీ మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ పై వచ్చిన ఆరోపణల విషయంలో అనేక తప్పుడు ఆరోపణలు మీడియా, సామాజిక మాధ్యమాల్లో కథనాలు వస్తుండటం బాధ కలిగిస్తోందని ఆయన భార్య ఆవేదన వ్యక్తం చేశారు. సుమంత్ విషయంలో వాస్తవాలను మాత్రమే ప్రచారం చేయాలని మీడియాను కోరుతున్నాను. సుమంత్ వ్యవహారంలో ఒకవైపు కథనాలు వస్తున్న నేపథ్యంలో మా కుటుంబం చెప్పే మరో కోణాన్ని కూడా పరిశీలించి వార్తలను ప్రచురించాలని శుక్రవారం మీడియాకు విడుదల చేసిన వీడియో సందేశంలో ఆమె ఈ విజ్ఞప్తి చేశారు. గత 20 రోజులుగా మా కుటుంబం పై తీవ్ర మానసిక ఒత్తిడి కొనసాగుతోందని ఆ ఒత్తిడిని తట్టుకోలేక మా మామయ్య సుబ్రహ్మణ్యం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. దాదాపు 60 నిద్రమాత్రలు మింగారు. ప్రస్తుతం ఆయన చావుబతుకుల మధ్య వెంటిలేటర్ పై చికిత్స పొందుతున్నారు. ఈ పరిస్థితి మా అందరికీ ఒక ఊహించని విషమ పరిస్థితిగా మారింది. ఇంత టార్చర్ ఎందుకు పెడుతున్నారో అర్థం కావడం లేదు. సుమంత్ విషయంలో వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతున్నాను.

**రాజకీయాలకు దూరంగా వ్యాపారం**

**రాజకీయాలకు దూరంగా వ్యాపారం చేసుకుంటున్నామని**

మాకు ఇవన్నీ ఎందుకని సుమంత్ కూడా తన జీవితాన్ని తిరిగి నిర్మించుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కేసులు, విచారణలు, కుటుంబ సభ్యులపై ఒత్తిడి కారణంగా ప్రశాంతంగా ఉండ లేకపోతున్నాం. సుమంత్ ఐఐఎంలో చదువుకుని కార్పొరేట్ రంగంలో మంచి జీవితాన్ని ఎంచుకునే అవకాశం ఉన్న వ్యక్తి, కొండా సురేఖ ఆంటీ, మురళి అంకుల్ తో ఉన్న స్నేహం, అభిమానంతో ఓఎస్డీ గా పనిచేయడానికి వచ్చారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల వల్ల ఆయన ఉద్యోగ జీవితం దెబ్బతింది. ఇప్పుడు కేసుల కారణంగా కుటుంబం మొత్తం ఇబ్బందులు పడుతోంది. సుమంత్ జీవితమే ఇప్పుడు నాశనమై పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

# అర్హుల ఓటు ఒక్కటీ మిస్ కావొద్దు!

- నో మ్యాపింగ్ ఓటర్ల పరిశీలనలో అప్రమత్తంగా ఉండాలి
- నోటీసులు అందుకున్న వారి నుంచి పత్రాలు తీసుకుని క్షుణ్ణంగా వెరిఫై చేయాలి..
- డిలీషన్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్ మహా :** ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల జాబితా పరిశీలనను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా నో మ్యాపింగ్ ఓటర్ల విషయంలో ఆధారాలు లేకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, నోటీసులు అందుకున్న వారి నుంచి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు సేకరించి క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. అర్హులైన ఓటర్లలో ఏ ఒక్కరి పేరు కూడా మిస్ కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్ ఓటర్ల జాబితా పరిశీలన జరుగుతున్న తీరును తెలుసుకునేందుకు కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం సాయంత్రం తిమ్మాపూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి నుంచి ప్రక్రియకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పత్రాలు సేకరించి పరిశీలించాలినో మ్యాపింగ్, కరెక్షన్స్‌కు సంబంధించి నోటీసులు అందించిన ప్రతి వ్యక్తి నుంచి అవసరమైన డాక్యుమెంట్లను సేకరించాలని కలెక్టర్ సూచించారు. సేకరించిన పత్రాలను బీఎల్‌వోల యాప్‌లో డౌన్‌లోడ్ చేసి, వాటిని జాగ్రత్తగా పరిశీలించాలని ఆదేశించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలు, ఆధారాలను నిబంధనల ప్రకారం నమోదు చేయాలని పేర్కొన్నారు.బీఎల్‌వోలు గ్రామాల వారీగా చేపడుతున్న ప్రక్రియను రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో బీఎల్‌వోలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

డిలీషన్లలో అప్రమత్తతఓటర్ల పేర్ల తొలగింపు విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని చిత్రా మిశ్రా సూచించారు. అర్హులైన ఓటర్ల పేరు పొరపాటున కూడా జాబితా నుంచి తొలగిపోకుండా చూడాలన్నారు. నోటీసులు అందించిన వారి నుంచి సరైన ధ్రువీకరణ పత్రాలు తీసుకుని, వాటి ఆధారంగా మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. నో మ్యాపింగ్ ప్రక్రియకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్టర్‌లో తేదీల వారీగా ఓటర్ల పేర్లు, నోటీసులు జారీ చేసిన కారణాలు, సమర్పించిన పత్రాలు తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు.

ఫారం-6, ఫారం-7పై శ్రద్ధకొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6, ఓటర్ల జాబితా నుంచి చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు సంబంధించిన ఫారం-7 అంశాల్లోనూ నిబంధనల ప్రకారం జాగ్రత్తగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు.అదేవిధంగా ఓటర్ల మార్పులు చేర్పులకు సంబంధించి ఫారం 8 ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో నో మ్యాపింగ్ జాబితా పరిశీలనను సమగ్రంగా పూర్తి చేయాలని, ఈ ప్రక్రియపై రెవెన్యూ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ వేముల శ్రీనివాస్‌తో పాటు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ANN తెలుగు
మహా పత్రిక
శనివారం వారం,
హైదరాబాద్
12-09-2026
మహా ప్రత్యేకం


# రాయలసీమ జెనెక్స్ స్టార్ టీమ్ తో ఫొటో షూట్



### ఉమెన్ ఏపీఎల్ టీమ్ బ్రాండ్ అంబాసిడర్ గా స్టార్ హీరోయిన్ నేడు కడపలో జెర్సీ లాంచ్

కడప, మహా : ఉమెన్ ఆంధ్రాప్రీమియర్ లీగ్ ఆసక్తిని కలిగిస్తోంది. ఈ టోర్నీలో భారత్ క్రికెట్ జట్టు ప్లేయర్లు ఉన్న హాట్ ఫేవరెట్ రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టుకు ప్రముఖ నటి, పాన్ ఇండియా హీరోయిన్ నిధి అగర్వాల్ బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తుండగా, శనివారం కడపలో రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టు జెర్సీ లాంచ్ కు ఆమె హాజరుకానున్నారు. ఏఎన్ఎన్ ఛానెల్ లో నిధి అగర్వాల్ అతిధిగా హాజరయ్యే జెర్సీ లాంచ్ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారం కానుంది. శ్రేయాస్ మీడియా ఈ ఈవెంట్ ఏర్పాట్లు చేస్తోంది. రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టుపై భారీ అంచనాలు ఏర్పడగా, నిధి అగర్వాల్ టీమ్ కు శుభాకాంక్షలు తెలిపారు. నిధి అగర్వాల్ ఎన్నో సూపర్ హిట్, అగ్ర హీరోల చిత్రాల్లో నటించారు. ఇస్మార్ట్ శంకర్, పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సరసన హరిహరవీరమల్లు, ప్రభాస్ సరసన రాజా సాబ్, అఖిల్, నాగచైతన్య సరసన కూడా నటించింది. బాలీవుడ్ లో టైగర్ ష్రాఫ్ సరసన, తమిళ్ లో శింబు సరసన ముద్దుగుమ్మ నటించింది. పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ ఉన్న హీరోయిన్ ఉమెన్ ఏపీఎల్ టీమ్ కు మద్దతుగా రావడం, రాయలసీమ జెనెక్స్ స్టార్ జట్టు తీసుకురావడం ఆసక్తికరంగా మారింది. దీంతో రాయలసీమ జెనెక్స్ మొత్తం ఏపీఎల్ లోనే స్పెషల్ గా మారింది.. ప్రపంచకప్ లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన శ్రీచరణి వంట ఎంతోమంది టాలెంటెడ్ ప్లేయర్లు ఇందులో ఉన్నారు. శుక్రవారం కడప వైఎస్ఆర్ ఆర్ స్టేడియంలో నిధి అగర్వాల్ అతిధిగా ఆర్టిస్ట్ లతో ఫొటో షూట్ కార్యక్రమం జరిగింది. జట్టు యజమానులు అమర్, రాజా రెడ్డి లు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉమెన్ ఏపీఎల్ లో రాయలసీమ జెనెక్స్ స్టార్ టీమ్ అత్యంత బలంగా ఉందని, కప్ రాయల సీమ దే నని ధీమా వ్య[illegible] చేశారు.


















## గుర్నాథ్ పల్లి సబ్ సెంటర్లో పోషకాహార వారోత్సవాలు

**వలిగొండ సెప్టెంబర్ 11 మహా న్యూస్ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం గుర్నాథ్ పల్లి అంగన్వాడి సెంటర్లో అంగన్వాడి టీచర్ తోట అలివేలు మంగమ్మ ఆధ్వర్యంలో పోషకాహార వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక సర్పంచ్ ఆవుల నరసింహ హాజరైనారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ మాట్లాడుతూ గర్భిణీలు బాలింతలు పోషణ కలిగిన టువంటి ఆహార పదార్థాలు ఆకు కూరలు పాలు గుడ్లు బెల్లం పల్లీలు నువ్వులు మునగ ఆకు మొదలగు ఆహార పదార్థాలు రోజువారి తినే ఆహారంలో తీసుకోవాలని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంతుల ప్రశాంత్, వార్డ్ మెంబర్స్ జక్క రఘు, నకరికంటి గీత, పంచాయతీ కార్యదర్శి శ్రీశైలం, ఆశ కార్యకర్త కేతం సౌజన్య, గర్భవతులు బాలింతలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి

**వలిగొండ సెప్టెంబర్ 11 మహా న్యూస్ :** వలిగొండ గ్రామపంచాయతీ అభివృద్ధికి గ్రామపంచాయతీ సభ్యులతో పాటు గ్రామస్తులు నాయకులు ప్రతి ఒక్కరు సహకరించాలని గ్రామపంచాయతీ సర్పంచ్ కుంభం వెంకట్ పాపిరెడ్డి అన్నారు సమావేశానికి హాజరైన ఎంపీడీవో జలంధర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరు పని చేయాలని సూచించారు స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అలాగే శాంతి భద్రతలకు ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు ఎంపీడీవో జలంధర్ రెడ్డి స్థానిక ఎస్సై శ్రీకాంత్ రెడ్డి నూతన పంచాయతీ కార్యదర్శి షేక్ రసూలను గ్రామపంచాయతీ సర్పంచ్ వెంకట పాపి రెడ్డి పాలకవర్గం సన్మానించారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శు షేక్ రసూల్ తో పాటు పాలక వర్గం గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు




## గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి



**సత్తుపల్లి, సెప్టెంబరు 11:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా భక్తిశ్రద్ధలు, సోదరభావంతో ప్రశాంతంగా నిర్వహించాలని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ సూచించారు. శుక్రవారం సత్తుపల్లిలోని ఏసీపీ కార్యాలయంలో గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ అవగాహన పోస్టర్లు, పాయింట్ బుక్‌లను నిర్వాహకులకు అందజేశారు. మండపాల నిర్వాహకులు పోలీసుశాఖ పోర్టల్‌లో ముందస్తుగా రిజిస్ట్రేషన్ చేసుకుని మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. విగ్రహ ప్రతిష్ఠాపన, పూజా కార్యక్రమాలు, ఊరేగింపు, నిమజ్జనం తదితర కార్యక్రమాలను ముందస్తు ప్రణాళికతో నిర్వహించుకోవాలని తెలిపారు. ప్రైవేటు స్థలాల్లో మండపాలు ఏర్పాటు చేస్తే యజమాని నుంచి నిరభ్యంతర ధ్రువీకరణ పత్రం తీసుకోవాలని సూచించారు.మండపాల వద్ద భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఏసీపీ తెలిపారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతోపాటు విద్యుత్ వైరింగ్‌ను నిపుణులతో తనిఖీ చేయించాలని సూచించారు. నాణ్యమైన విద్యుత్ తీగలు, పరికరాలను మాత్రమే వినియోగించాలని, అగ్నిప్రమాదాల నివారణకు నీరు, ఇసుక, అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. అత్యవసర మార్గాలను ఎట్టి పరిస్థితుల్లోనూ మూసివేయరాదన్నారు. మండపాలను ప్రధాన రహదారులు, అధిక ట్రాఫిక్ ప్రాంతాలు, వివాదాస్పద స్థలాల్లో ఏర్పాటు చేయవద్దని కోరారు. ప్రతి మండపంలో కనీసం ఇద్దరు నిర్వాహకులు 24 గంటలూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదని ఏసీపీ స్పష్టం చేశారు. నిబంధనలకు లోబడి రెండు మైకులతో కూడిన స్పీకర్లను మాత్రమే వినియోగించాలని, ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే సౌండ్ సిస్టమ్ ఉపయోగించాలని తెలిపారు. అధిక శబ్దంతో ప్రజలకు ఇబ్బంది కలిగించరాదన్నారు. అసభ్యకర నృత్యాలు, కార్యక్రమాలకు తావివ్వకూడదని సూచించారు.విగ్రహాల ఊరేగింపు, నిమజ్జనం సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని ఏసీపీ తెలిపారు. నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని, ఊరేగింపులో పాల్గొనే వారు క్రమశిక్షణతో వ్యవహరించేలా నిర్వాహకులు బాధ్యత తీసుకోవాలని సూచించారు. నిమజ్జన ప్రదేశాల్లో విద్యుత్, నీట మునిగే ప్రమాదాల నివారణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, చిన్నారులు, ఈత రాని వారు నీటిలోకి వెళ్లకుండా పర్యవేక్షించాలని చెప్పారు. అనుమానాస్పద పరిస్థితులు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఇన్‌స్పెక్టర్ తుమ్మలపల్లి శ్రీహరి, మహిళా ఎస్ఐ కవిత, ఎస్ఐలు అశోక్, ప్రదీప్, పోలీసు సిబ్బంది, గణేష్ మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల బలోపేతమే ప్రభుత్వ లక్ష్యం

- **పంచాయతీరాజ్ సవరణ చట్టంపై ప్రభుత్వ విప్ విజయరమణారావు**



**పెద్దపల్లి: మహా :** గ్రామ పంచాయతీలను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చింతకుంట విజయరమణారావు అన్నారు. పంచాయతీరాజ్ సవరణ చట్టంపై శాసనసభలో మాట్లాడేందుకు అవకాశం కల్పించిన స్పీకర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ పంచాయతీలకు మరింత అధికారాలు, బలోపేతం కల్పించే దిశగా 2018లోని సెక్షన్ 70(3)కు సవరణలు తీసుకురావాలని మంత్రి సీతక్క ప్రతిపాదించారని పేర్కొన్నారు. "గ్రామాలు రాష్ట్రానికి, దేశానికి పట్టుకొమ్మలు" అని విజయ రమణారావు అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గ్రామ పంచాయతీలను నిర్వీర్యం చేశారని ఆయన ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటూ, పంచాయతీలను మరింత బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని విజయరమణారావు తెలిపారు.

## అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం:కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** విధి నిర్వహణలో అటవీ సంపద పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు సిబ్బంది సేవలు త్యాగాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్స్ లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అమరవీరుల సంస్మరణ సభకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులు చలమల శ్రీనివాసరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎంతోమంది అటవీ శాఖ అధికారులు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం వారి సేవలను భావితరాలకు తెలియజేయడం మనందరి బాధ్యత అని అన్నారు. అటవీ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఇతర సిబ్బంది అటవీ సంపద సంరక్షణలో అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ భద్రతా పరికరాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇతర మౌలిక సౌకర్యాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో అటవీ నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఒక రకమైన నేరాలు అధికంగా ఉండగా ప్రస్తుతం సైబర్ నేరాలు కృత్రిమ మేధస్సు ఆధారిత నేరాలు తదితర కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అదే విధంగా అటవీ నేరాలను అరికట్టేందుకు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అటవీ శాఖ సిబ్బంది సాంకేతికంగా మరింత సామర్థ్యం పెంచుకోవాలని అన్నారు. శాస్త్రీయ పద్ధతులు ఆధునిక పరికరాలు లైటింగ్ కమ్యూనికేషన్ తదితర సౌకర్యాలతో పాటు సిబ్బందికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ సిబ్బంది కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ సంపదను పరిరక్షించేందుకు అటవీ శాఖ అధికారులు సిబ్బంది మరింత అంకితభావంతో పనిచేయాలని కష్టపడి పనిచేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తారమైన అటవీ ప్రాంతాన్ని కలిగి ఉందని ఇక్కడి గిరిజన సమాజానికి అడవులతో ఎంతోకాలంగా సన్నిహిత సంబంధం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కోయలు కొండరెడ్లు తదితర గిరిజన సమాజాలు అడవులతో మమేకమై జీవిస్తున్నారని అటవీ శాఖ గిరిజన సమాజాల మధ్య పరస్పర సహకారం సమన్వయం ఎంతో ముఖ్యమని అన్నారు. అటవీ సంపదను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అటవీ సంరక్షణ అటవీ హక్కులు తదితర అంశాలపై అధికారులు అటవీ శాఖ సిబ్బంది గిరిజన సమాజాల భాగస్వామ్యంతో అవగాహన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అడవులను కాపాడటం పర్యావరణాన్ని పరిరక్షించడం ఎంత ముఖ్యమో అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను పాటిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.అటవీ అమరవీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో అటవీ సంపదను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం సమాజం అండగా నిలవాలని వారి త్యాగాలకు తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి సిధార్థ్ విక్రమ్ సింగ్ , అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర అటవీ శాఖ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## విజిలెన్స్ విభాగంపై అవగాహన ఉండాలి

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** సింగరేణిలోని విజిలెన్స్ విభాగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ లు వంశీధర్ కుసుంబ, ఎం.కనకమ్మలు తెలిపారు. విజిలెన్స్ అవగాహన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం సింగరేణి ప్రధాన ఆసుపత్రి నందు సిఎంపిఎఫ్ సింగరేణి ప్రధాన ఆసుపత్రి వైద్యులు సిబ్బందితో విజిలెన్స్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిఎంపిఎఫ్ రీజనల్ కమిషనర్ లు వంశీధర్ కుసుంబ, ఎం.కనకమ్మలు హాజరై మాట్లాడారు. ఈ ఏడాది సత్యనిష్ఠతో సమృద్ధి అనే థీమ్ తో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించుకుంటున్నామని తెలిపారు. మనం మన చేసే ప్రతీ పనిలో నీతి నిజాయితీ పారదర్శకత అవసరం అని ఈ విజిలెన్స్ అవగాహన కార్యక్రమంలో ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యం చేయడం ద్వారా పారదర్శకమైన అవినీతి రహిత దేశాన్ని నిర్మించడం సాధ్యమవుతుందని తెలిపారు. సిఎంపిఎఫ్ఓకి సంబంధించిన అన్ని లావాదేవీలు సికేర్ పోర్టల్ ద్వారానే జరుగుతాయని సిఎంపిఎఫ్ బ్యాలెన్స్ లోన్స్ కు సంబంధించిన అన్ని వివరాలను సికేర్ పోర్టల్ ద్వారా తెలుసుకోవచ్చని సిఎంపిఎఫ్ కు సంబంధించిన ఎటువంటి సమస్యలు ఉన్నా మధ్యవర్తులను కాకుండా నేరుగా సిఎంపిఎఫ్ఓ కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో సిఎంఓ ఆర్.కిరణ్ రాజ్ కుమార్, సిఎంపిఎఫ్ఓ ఎన్ఫోర్స్ ఆఫీసర్లు వి.సులోచన, ఎస్.శ్రీనివాస్, డాక్టర్ కేవీఎస్. విశ్వ మేధి, వెల్ఫేర్ ఆఫీసర్ ఇక్బాల్ షరీఫ్, ఇతర సింగరేణి ప్రధాన ఆసుపత్రి డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

## భూ రీ సర్వేను వేగంగా పూర్తి చేయాలి: కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** భూ రీ సర్వేలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించి భూ సరిహద్దులను కచ్చితంగా నిర్ధారిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రోవర్ ట్యాబ్ పరికరాలతో చేపడుతున్న డిజిటల్ సర్వే ప్రక్రియను పరిశీలించి పనుల పురోగతిని తెలుసుకున్నారు. డిజిటల్ విధానంలో సర్వే నిర్వహించడం వల్ల సమయం సిబ్బంది ఆదా కావడంతో పాటు ట్యాబ్‌లో నమోదైన సమాచారాన్ని నేరుగా కంప్యూటర్ ఆటోక్యాడ్‌లోకి మార్చుకునే అవకాశం ఉందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అమ్మగారిపల్లి, కుమ్మగూడెం పరిధిలో కాడస్ట్రల్ మ్యాపులు పాత రెవెన్యూ రికార్డుల ఆధారంగా సుమారు 1,900 ఎకరాలకు పైగా భూముల సరిహద్దులను నిర్ధారిస్తున్నట్లు అధికారులు తెలిపారు. 1920ల నాటి ఫసలీ రికార్డులతో పాటు బూర్గంపాడు తాలూకాకు సంబంధించిన పాత రికార్డులను పరిశీలిస్తున్నట్లు వివరించారు. మూడు తరాలుగా భూములను అనుభవిస్తున్నప్పటికీ రికార్డుల్లో ఉపవిభజనలు నమోదు కాకపోవడం వల్ల ఎదురవుతున్న సమస్యలను రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. గోదావరి వరదలు భూమి కోతల కారణంగా కొన్ని ప్రాంతాల్లో పాత భూ సరిహద్దులు మారిపోయాయని సీతారామ ప్రాజెక్టు పరిసరాల్లో కొన్ని చోట్ల సుమారు 250 మీటర్ల మేర మార్పులు చోటుచేసుకున్నట్లు అధికారులు వివరించారు. 57/1 తదితర సర్వే నంబర్లలో నీట మునక ఇసుక మేటల కారణంగా పాత భూ గుర్తులు కనుమరుగైనట్లు తెలిపారు.కేఎంఎల్ ఫైళ్ల ఆధారంగా సుమారు 7.91 కిలోమీటర్ల మేర సరిహద్దులను గుర్తిస్తున్నామని రోజుకు సుమారు 2 కిలోమీటర్ల చొప్పున సర్వే నిర్వహించి 2 నుంచి 4 రోజుల్లో పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు తెలిపారు. పాత రికార్డులను సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తూ రైతులకు భూములపై స్పష్టత కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తమ ప్రాంతంలో రహదారి నిర్మించాలని కలెక్టర్‌ను కోరగా అశ్వాపురం హెవీ వాటర్ ప్లాంట్ సీఎస్ఆర్ నిధులతో అవసరమైన మేరకు రహదారి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సూర్యప్రకాష్, సర్వే అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, గ్రామస్తులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## డాక్టరేట్ పట్టా.. మురిసిన హైమావతి

- **గవర్నర్ చేతుల మీదుగా అవార్డు**
- **ఆనందంలో హైమావతి కుటుంబ సభ్యులు**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** కొత్తగూడెం సింగరేణి కార్మిక ప్రాంతానికి చెందిన సంధ్యాల హైమావతి ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పీహెచ్డీ చేసి డాక్టరేట్ సాధించారు. సింగరేణిలో కార్మికుడిగా పని చేసిన స్థానిక మధుర బస్తీకి చెందిన సంధ్యాల కొమరయ్య, శంకరమ్మల కుమార్తె హైమావతి ఉస్మానియా యూనివర్సిటీ నుండి డాక్టర్ పట్టా సాధించారు. ఇటీవల హైదరాబాదులో ఓయూ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన 85వ స్నాతకోత్సవంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయం ఛాన్స్ లర్ శివప్రసాద్ శుక్ల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకున్నారు. డాక్టర్ ఆలియా మేడం పర్యవేక్షణలో రసాయన శాస్త్ర విభాగంలో"డాకింగ్ స్టడీస్ అండ్ టెట్రాజోల్ డేరివాటివ్స్" అంశంపై చేసిన పరిశోధన పత్రానికి పట్టా లభించింది. పేదరికం నేపథ్యం నుండి వచ్చినప్పటికీ పట్టుదలతో చదివి ఉన్నత విద్యలో రాణించి డాక్టరేట్ పట్టాను హైమావతి పొందడం పట్ల ఆమె తల్లిదండ్రులు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. హైమావతి కొత్తగూడెం ఊరికి మంచి పేరు తీసుకురావడం పట్ల ఆమెకు పట్టణ ప్రముఖులు, మిత్రులు అభినందనలు తెలిపారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసులకు సమాచారం ఇవ్వాలి

**క్యాతనపల్లి, మహా :** వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసి విగ్రహాలను ప్రతిష్ఠించే నిర్వాహకులు తప్పనిసరిగా పోలీస్ శాఖకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలని రామకృష్ణాపూర్ ఎస్ఐ జె. శ్రీధర్ సూచించారు. మండపం, విగ్రహం వివరాలు, కమిటీ సభ్యులు, ఫోన్ నంబర్లు, ప్రతిష్ఠాపన, నిమజ్జనం తేదీ, సమయం, ప్రదేశం, వాహన వివరాలను పోలీస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.ఉత్సవాలను పోలీస్ నిబంధనలకు అనుగుణంగా ప్రశాంతంగా నిర్వహించాలని, పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 100 లేదా 112కు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.



## బొగ్గు లారీల దందాతో రహదారి బందీ.. అధికారుల చోద్యం

- **కిష్టారం, సత్తుపల్లి జాతీయ రహదారిపై అడ్డగోలు పార్కింగ్‌తో ప్రయాణికులకు నరకయాతన**
- **లారీ యూనియన్ నిర్వాకంపై పరిసర గ్రామాల ప్రజల ఆగ్రహం.. మేల్కొనని సింగరేణి, పోలీస్ శాఖలు**

**సత్తుపల్లి, సెప్టెంబరు 11: మహా :** సింగరేణి బొగ్గు రవాణా కార్యకలాపాలు సాగుతున్న కిష్టారం గ్రామ పరిధిలో జాతీయ రహదారి దుర్భరంగా మారింది. కిష్టారం లారీ యూనియన్ కార్యాలయం ద్వారా సింగరేణి బొగ్గు లోడింగ్ కోసం వచ్చే లారీలను రహదారికి ఇరువైపులా అడ్డగోలుగా నిలుపుతుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బొగ్గు లారీల రాకపోకలకు తోడు రోడ్డుపై పేరుకుపోయిన బురద, దుమ్ము, గుంతలతో ప్రయాణం ప్రమాదకరంగా మారింది

**స్థలం ఉన్నా.. రోడ్డుపైనే ఎందుకు?**

లారీల పార్కింగ్ కోసం సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో స్థలం ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. అయినప్పటికీ ఆ స్థలాన్ని సక్రమంగా వినియోగించకుండా జాతీయ రహదారిపై లారీలను నిలిపివేయడం వెనుక అసలు కారణమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రహదారిపై లారీలను నిలిపివేయడం వల్ల ప్రజా రవాణాకు ఆటంకం కలుగుతున్నా సంబంధిత నిర్వాహకులు కనీస బాధ్యత వహించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.





**జాతీయ రహదారి బందీ..**

కిష్టారం లారీ యూనియన్ కార్యాలయం వద్ద బొగ్గు లోడింగ్ కోసం వచ్చే లారీలు గంటల తరబడి రహదారికి ఇరువైపులా నిలిచి ఉంటున్నాయి. దీంతో వాహనాలు ఒకదానికొకటి దారి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతోంది. ముఖ్యంగా రాత్రివేళల్లో భారీ వాహనాల మధ్య చిన్న వాహనాలు, ద్విచక్రవాహనదారులు ప్రయాణించడం ప్రాణాల మీదకు తెస్తోంది.

**బురదతో మరింత ప్రమాదం..**

బొగ్గు లారీల రాకపోకల కారణంగా రహదారిపై మట్టి, బురద పేరుకుపోతుండటంతో వాహనదారులకు ఇబ్బందులు రెట్టింపవుతున్నాయి. వర్షం పడినప్పుడు రహదారి జారుడుగా మారి ప్రమాదాలకు కారణమవుతోంది. దుమ్ము కాలుష్యంతో పాటు బురద సమస్య కూడా ప్రయాణికులను వేధిస్తోంది.

**విన్నపాలు పట్టించుకోని నిర్వాహకులు**

పరిసర గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, వాహనదారులు పలుమార్లు లారీలను రహదారిపై నిలపవద్దని లారీ యూనియన్ నిర్వాహకులకు విన్నవించినట్లు సమాచారం. పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం ఉన్నందున దానిని వినియోగించాలని కోరినా స్పందన లేకపోవడం పట్ల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల మౌనం.. ఎవరికి మేలు?**

జాతీయ రహదారిపై ప్రజలకు ఇబ్బంది కలిగించేలా లారీలను నిలిపివేస్తున్నా సింగరేణి అధికారులు, పోలీస్ శాఖ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ బాధ్యతలను విస్మరిస్తున్న అధికారుల వైఖరిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజల ప్రయాణ హక్కును కాపాడేందుకు రహదారిపై లారీల నిలుపుదలను తక్షణమే అరికట్టాలని, 10 ఎకరాల పార్కింగ్ స్థలాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని పరిసర గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

- వైద్యులందరూ సమయపాలన పాటించాలి
- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్

**భద్రాద్రి కొత్తగూడెం, మహా**: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ సూచించారు. శుక్రవారం జిల్లాలోని అన్ని వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలు ఆసుపత్రుల పనితీరు మాతా శిశు ఆరోగ్యం అసంక్రమిత వ్యాధుల నియంత్రణ తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఆసుపత్రుల్లో సమయపాలన తప్పనిసరి అన్నారు. ఆసుపత్రుల్లో వైద్యులు సిబ్బంది తప్పనిసరిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో కూడా ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందేలా సగం రోజు ఆసుపత్రులను నిర్వహించాలని ఇందుకోసం సిబ్బందికి విధులు కేటాయించాలని ఆదేశించారు.అలాగే గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలు మరింత చేరువయ్యేలా ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు వైద్య శిబిరాలను సంబంధిత గ్రామాలు గిరిజన గూడేలు ఆవాసాల్లో క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు.ముఖ్యంగా రక్తపోటు మధుమేహం ఉన్న రోగులను గుర్తించి వారికి ప్రతి నెలా క్రమం తప్పకుండా ఫాలోఅప్, ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. గుర్తించిన రోగులకు అవసరమైన చికిత్స మందులు తదుపరి వైద్య సేవలు నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయంలో ఆధునిక సాంకేతికత

- డ్రోన్ పిచికారీతో సమయం, సాగు ఖర్చు ఆదా
- డిజిటల్ క్రాప్ సర్వే, డ్రోన్ స్ప్రేయింగ్ పరిశీలించిన కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్ మహా**: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయంలో విస్తృతంగా వినియోగించడం ద్వారా సాగు ఖర్చులను తగ్గించడంతోపాటు సమయం ఆదా చేసి రైతులు అధిక లాభాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం తలమడుగు మండలం పల్సి (కె) గ్రామంలో పర్యటించిన ఆయన డిజిటల్ క్రాప్ సర్వే, డ్రోన్ ద్వారా పత్తి చేనులో పురుగుమందుల పిచికారీని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు ఘన్‌శ్యామ్ పత్తి చేనులో డ్రోన్ ద్వారా పురుగుమందుల పిచికారీ చేసే విధానాన్ని కలెక్టర్ పరిశీలించి, దాని వినియోగం, ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పరిసర పొలాల్లో వాలంటీర్ నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వే ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన గ్రామస్థుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం, నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామంలోని మౌలిక వసతుల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించే విషయమై ఇప్పటికే ఆర్టీసీ డీఎంతో మాట్లాడినట్లు చెప్పారు. పల్సి (కె) నుంచి తాండా వరకు రహదారి మంజూరైందని, డోర్లి రహదారి సమస్యను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని ఐటీడీఏ ద్వారా త్వరలో పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.వర్షాభావ పరిస్థితులను అధిగమించి రైతులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు సమీకృత వ్యవసాయ విధానాలను అవలంబించాలని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పథకం కింద ఫాంపాండ్లు నిర్మించుకుంటే రెండో పంట సాగుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ఇప్పటికే ఉన్న ఫాంపాండ్లను బలోపేతం చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. ఫాంపాండ్లతోపాటు పశువుల షెడ్లు, వర్మీ కంపోస్ట్ యూనిట్లు ఏర్పాటు చేసుకుని ప్రకృతి వ్యవసాయం చేపట్టే రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తుందని పేర్కొన్నారు.నిరుద్యోగ యువత అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జిల్లాలో తొలిసారిగా పల్సి (కె) గ్రామానికి చెందిన ఇద్దరు యువకులకు డ్రోన్ పైలట్ శిక్షణ ఇప్పించి, సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.లక్ష మార్జిన్ మనీతోపాటు రాయితీపై బ్యాంకు రుణం అందించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరింత మంది యువతకు డ్రోన్ స్ప్రేయింగ్‌లో ఉచిత శిక్షణ అందిస్తామని వెల్లడించారు. పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న అభ్యర్థుల కోసం ఆదిలాబాద్ లోని స్టడీ సర్కిల్ ద్వారా 100 మంది కానిస్టేబుల్, మరో 100 మంది ఎస్ఐ అభ్యర్థులకు ఉచిత శిక్షణ అందించనున్నట్లు తెలిపారు.అనంతరం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్‌ను కలెక్టర్ పరిశీలించి, దాని నిర్వహణపై సిబ్బందిని అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బి. రవీందర్ సింగ్, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, కేవీకే సీనియర్ సైంటిస్ట్ డా. ఎన్. రామగోపాల్ వర్మ, తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శంకర్, సర్పంచ్ నైతం చిన్ను, వ్యవసాయ శాఖ సాంకేతిక అధికారులు విశ్వామిత్ర వెండి, విశ్వనాథ్, కేవీకే శాస్త్రవేత్తలు డా. రఘువీర్, డా. ఎం. సురేష్, మండల వ్యవసాయ అధికారి ఎం. ప్రమోద్ రెడ్డి, గ్రామస్థులు, డ్రోన్ ఆపరేటర్లు, సాంకేతిక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణ సమాజ్ భవనం ప్రారంభం

**ఆదిలాబాద్ మహా** : బ్రాహ్మణ సమాజ్‌కు భవనం అందుబాటులోకి రావడం సంతోషకరమైన విషయమని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో శుక్రవారం జరిగిన బ్రాహ్మణ సమాజ్ భవనం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆమె మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష మాట్లాడుతూ.. ప్రభుత్వం, కలెక్టర్ సహకారంతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకోవడం అభినందనీయమని తెలిపారు.అదేవిధంగా ఈ భవనం కేవలం బ్రాహ్మణ సమాజానికి మాత్రమే పరిమితం కాకుండా, అన్ని కులాలు, మతాలు, వర్గాలకు చెందిన ప్రజలకు ఉపయోగపడే విధంగా అందుబాటులో ఉంటుందని బ్రాహ్మణ సమాజ్ ప్రతినిధులు తెలిపారు. సామాజిక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక ఇతర ప్రజా కార్యక్రమాలకు ఈ భవనం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా భవనాన్ని వినియోగించుకోవడం ద్వారా సామాజిక ఐక్యత, సోదరభావం మరియు పరస్పర సహకారానికి ఈ భవనం వేదికగా నిలవాలని వారు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా బ్రాహ్మణ సమాజ్ ప్రతినిధులు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ , మున్సిపల్ చైర్‌పర్సన్ సంబంధిత ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సమాజ్ ప్రతినిధులు, సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.




# అథ్లెటిక్స్‌లో మిరాకిల్ మైండ్ విద్యార్థుల ప్రతిభ

**సత్తుపల్లి, సెప్టెంబర్ 11:మహా** : మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తుపల్లి సిద్దారం రోడ్డులోని మిరాకిల్ మైండ్స్-ది స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. అండర్-17, అండర్-14 విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచారు. అండర్-17 పురుషుల విభాగంలో నిర్వహించిన 100 మీటర్ల పరుగుపందెంలో 9వ తరగతి విద్యార్థి పార్థు ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్-14 బాలికల విభాగంలో 7వ తరగతి విద్యార్థిని సాత్విక 100 మీటర్ల పరుగులో ప్రథమ స్థానం, లాంగ్ జంప్‌లో ద్వితీయ స్థానాన్ని సాధించింది. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ ఎం. రత్నాకర్ అభినందించారు. విద్యార్థుల కృషితోపాటు క్రీడా ఉపాధ్యాయుల శిక్షణ అభినందనీయమని పేర్కొన్నారు. విద్యతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించేందుకు పాఠశాల యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారిస్తోందని తెలిపారు.

# కార్మిక సంక్షేమ సహాయ కేంద్రం ప్రారంభం

**హాజరైన కలెక్టర్, మున్సిపల్ చైర్ పర్సన్ సద్వినియోగం చేసుకోవాలని సూచన**



**ఆదిలాబాద్ మహా:** కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం పట్టణంలోని కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్మిక సంక్షేమ సహాయ కేంద్రం ప్రారంభోత్సవానికి మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష, మార్కెట్ కమిటీ ఛైర్మన్ శ్రీకాంత్ రెడ్డితో కలిసి హాజరయ్యారు. రిబ్బన్ కట్ చేసి సహాయ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్మికులకు శాఖ ద్వారా అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ .. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం మంజూరు చేసిన నూతన లేబర్ ఫెసిలిటేషన్ కేంద్ర భవనాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ధాన్యం, పత్తి కొనుగోలు సీజన్లలో గోదాములు, కొనుగోలు కేంద్రాల్లో కార్మికులు రాత్రింబవళ్లు కష్టపడి రైతులకు, అధికార యంత్రాంగానికి ఎంతో సహకరించారని కొనియాడారు. ఆర్అండ్‌బీ అధికారుల సహకారంతో వివాదాలు లేని స్థలాన్ని ఎంపిక చేసి నాణ్యతతో నిర్మాణం పూర్తి చేశామన్నారు. ధాన్యం, పత్తి కొనుగోలు సీజన్లలో రాత్రింబవళ్లు శ్రమిస్తూ రైతులకు, యంత్రాంగానికి అండగా నిలుస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. భవన నిర్మాణం పూర్తికావడం మాత్రమే కాకుండా, దాని నిరంతర నిర్వహణ కీలకమని సూచించారు. అధికారులు, కార్మిక సంఘాల నాయకులతో త్వరలోనే ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిత్యం సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భవన నిర్మాణానికి కృషి చేసిన ఇంజినీరింగ్ సిబ్బంది, అధికారులకు ఆయన అభినందనలు తెలిపారు.మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ మాట్లాడుతూ, కార్మికులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా వారికి అవసరమైన వైద్యం, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సహాయ కార్యక్రమాలు సులభంగా అందేలా కార్మిక సంక్షేమ సహాయ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.కార్మికులు రోడ్లపై ఇబ్బందులు పడకుండా, ఈ సహాయ కేంద్రం ద్వారా తమకు అవసరమైన సమాచారం, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు, పని అవకాశాలకు సంబంధించిన సమాచారం పొందుతూ గౌరవప్రదంగా జీవించేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని అన్నారు.కార్మికుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులైన వారికి చేరేలా ఈ కేంద్రం ఒక సహాయక వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి అవసరమైన సహకారం అందించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తారని తెలిపారు.మన సమాజ నిర్మాణంలో కార్మికుల పాత్ర ఎంతో గొప్పదని చైర్‌పర్సన్ అన్నారు. మన ఇళ్ల నుంచి పెద్ద పెద్ద భవనాలు,కార్యాలయాలు, రోడ్లు, వివిధ అభివృద్ధి పనుల వరకు ప్రతి నిర్మాణం వెనుక కార్మికుల శ్రమ ఉంటుందని, వారి కష్టం మరియు చెమటతోనే మన అభివృద్ధికి బలమైన పునాది ఏర్పడుతుందని అన్నారు.కార్మికులను కేవలం పనివారిగా కాకుండా మన అభివృద్ధిలో భాగస్వాములుగా గౌరవించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ముత్యం రెడ్డి, అసిస్టెంట్ లేబర్ అధికారులు రాజలింగం, వినోద్, పంచాయతీ రాజ్ ఈఈ శివరామ్, కౌన్సిలర్ కలాల శ్రీనివాస్, కార్మిక సంఘం నాయకులు రాజు, కార్మికులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణహిత గణేష్ విగ్రహాల పంపిణీ

**రాజేంద్రనగర్ మహా** ; వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను శంషాబాద్ జోనల్ కమిషనర్ కె చంద్రకళ, శంషాబాద్ సర్కిల్ 18 డిప్యూటీ కమిషనర్ బి సుమన్ రావు తో కలిసి శంషాబాద్ జోనల్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పంపిణీ చేశారు. కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు సంప్రదాయ పద్ధతిలో వినాయక చవితి వేడుకలను నిర్వహించాలనే సందేశాన్ని జిహెచ్ఎంసి పరిధిలోని ప్రజలకు అందించారు. పండుగలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలకు బదులుగా మట్టి ఇతర పర్యావరణహిత గణేష్ విగ్రహాలను వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గణేష్ విగ్రహాల నిమజ్జనం సందర్భంగా నీటి కాలుష్యాన్ని నివారించేందుకు ప్రజలు పర్యావరణహిత విధానాలను పాటించాలని, పరిశుభ్రమైన పచ్చని వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని అధికారులు పిలుపునిచ్చారు.






# కార్మికులు మట్టి వినాయకులనే ప్రతిష్టించాలి

**మందమర్రి, మహా :** వినాయక చవితి సందర్భంగా కార్మిక కుటుంబాలు, ప్రజలు మట్టి వినాయకులనే ప్రతిష్టించాలని సింగరేణి పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. శుక్రవారం సింగరేణి పాఠశాల కళ్యాణిఖని లో మట్టి వినాయక విగ్రహాల తయారీ విధానాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కొరకు, వాటి ప్రయోజనాల కొరకు ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని అన్నారు. ఆకర్షణీయంగా ఉండే ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలతో కలిగే నీటి కాలుష్యం గురించి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. వీరు పిల్లలు అయినప్పటికీ మట్టి వినాయకుడిని ప్రతిష్ఠిద్దాం - పర్యావరణాన్ని పరిరక్షిద్దాం అనే సందేశాన్ని అందించడం గమనార్హం.

# శంషాబాద్ లో ఐదు రూపాయల భోజనం ఏర్పాటు చేయాలి

- మంత్రి శ్రీధర్ బాబుకు వినతి పత్రం అందజేసిన. ఏఐటీయూసీ నాయకులు...



**రాజేంద్రనగర్ మహా:** గ్రేటర్ శంషాబాద్ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఐదు రూపాయల క్యాంటీన్ భోజనం ఏర్పాటు చేయాలని ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షులు వనంపల్లి జైపాల్ రెడ్డి, భవన నిర్మాణ కార్మిక సంఘం సిపిఐ పార్టీ శంషాబాద్ మండలం కార్యదర్శి నర్రా గిరి తెలంగాణ రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబుని కలసి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ జిల్లాల నుండి కార్మికులు జీవనోపాధి కోసం శంషాబాద్ కు కార్మికులు వేలాదిగా వస్తున్నారు. లేబర్ అడ్డాల దగ్గర ఉపాధి లేకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది కార్మికులు ఉన్న శంషాబాద్ లోనీ అంబేద్కర్ చౌరస్తా వద్ద ఐదు రూపాయల భోజనాన్ని (ఇందిరమ్మ క్యాంటీన్) ఏర్పాటు చేయాలని మంత్రి శ్రీధర్ బాబుని కోరి వినతి పత్రం అందజేశారు.తప్పకుండా శంషాబాద్ లో ఐదు రూపాయల భోజనం ఇందిరమ్మ క్యాంటీన్ ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని ఏఐటీయూసీ నాయకులు తెలిపారు.

## శంషాబాద్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేందర్

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ నియమితులయ్యారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో కలిసి ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలను కలుపుకొని శంషాబాద్ మండలంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తానని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.



# ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలి

**పీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి డిమాండ్**



భద్రాద్రి కొత్తగూడెం, మహా: ఎమ్మెల్సీ తాతా మధును తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అధ్యక్షతన కొత్తగూడెంలోని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన పసుపు నీళ్ల శుద్ధీకరణ కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు అత్యంత పాశవికమైనవని సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతున్నాయని మండిపడ్డారు.అధికారం పోతే అసెంబ్లీకి రారా? అధికారం కోల్పోగానే బీఆర్ఎస్ నాయకులు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ కనీసం అసెంబ్లీ సమావేశాలకు కూడా హాజరుకాకుండా ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు.బీఆర్ఎస్ పార్టీ కేవలం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తుల ప్రయోజనాల కోసమే నడుస్తోందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి ప్రాంతీయ తత్వం తప్ప ప్రజల బాగు పట్టదన్నారు. ఇదే క్రమంలో బీజేపీపై విమర్శలు చేస్తూ బీజేపీ కేవలం మతతత్వ రాజకీయాలతో పబ్బం గడుపుకుంటోందని ఈ రెండు పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో ఇప్పటికే విజయవంతంగా రైతులకు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోందని ఉచిత విద్యుత్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అనేక ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. భవిష్యత్తులోనూ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ విలేఖరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్నతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొనేరు సత్యానారాయణ, ఆళ్ల మురళి, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతు రావు, శ్రీనివాసరావు, కార్తీక్, వై.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి రెవెన్యూ శాఖ లో వసూళ్ల భాగోతం!?

- అధికారుల దందాలో - మధ్యవర్తుల హవా
- ఫైల్ కదలాలంటే కాసులు కురిపించాల్సిందేనా?
- అవినీతి అధికారులపై బదిలీ వేటు సరిపోతుందా?
- ఏసీబీ కేసులు, ఆరోపణలు అయినా మారని తీరు



**పెద్దపల్లి, మహా :** పెద్దపల్లి జిల్లా రెవెన్యూ శాఖలో అవినీతి తిమింగలాలు రెచ్చి పోతున్నాయా? భూమి పని అంటేనే బేరసారమా? అంటే అవుననే సమాధానం వస్తోంది క్షేత్రస్థాయి నుంచి.

భూ మ్యుటేషన్లు, ధరణి రికార్డుల సవరణ, సర్వే నెంబర్ల వివాదాలు, ధ్రువీకరణ పత్రాల జారీ.. ఏది కావాలన్నా మధ్యవర్తి లేకుండా ఫైల్ ముందుకు కదలని పరిస్థితి నెలకొందని రైతులు, బాధితులు ఆరోపిస్తున్నారు.

**ఫైల్ కదలాలంటే కాసులు కురిపించాలా..?**

సకాలంలో కావాల్సిన సేవలు అందక, కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయి, చివరకు అనధికారికంగా డబ్బులు సమర్పించుకోవాల్సి వస్తోందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. పెండింగ్ ఫైళ్ల లిస్టు తీస్తే అసలు దందా బయటపడుతుందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**మధ్యవర్తులే కీలకమా?**

ఆయా మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారుల కంటే మధ్యవర్తుల హవానే ఎక్కువగా కనిపిస్తోందనే విమర్శ ఉంది. వీరికి అధికారులతో ఉన్న సంబంధం ఏంటి? వీరి జోక్యం లేకుండా సామాన్యుడి పని ఎందుకు కావడం లేదు? ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేస్తే దిమ్మతిరిగే నిజాలు బయటపడతాయని స్థానికులు అంటున్నారు.

**గతంలో ఏసీబీ.. ఇప్పుడు మళ్లీ అదే తీరు**

అంతర్గాం, పెద్దపల్లి, , శ్రీరాంపూర్ మండలాల్లో గతంలో ఏసీబీ వల విసిరినా, మళ్లీ అదే పరిస్థితి పునరావృతం అవుతోందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. శ్రీరాంపూర్ పరిధిలో చెరువు శిఖం భూమిని నిబంధనలకు విరుద్ధంగా నాలాగా మార్చిన వ్యవహారంలో ఫిర్యాదులు వచ్చినా, కేవలం బదిలీతో సరిపెట్టారనే ఆరోపణలు సంచలనంగా మారింది.

**కోర్టు కెళ్లండి అంటూ తప్పించుకునే ప్రయత్నమా?**

రెవెన్యూ పరిధిలో పరిష్కారం చేయాల్సిన చిన్న తప్పులకు కూడా "కోర్టుకు వెళ్లండి" అంటూ చేతులు దులుపు కుంటున్నారని బాధితులు వాపోతున్నారు. ఆర్టీఐ సమాచారం కూడా ఇవ్వకుండా తిప్పించుకుంటున్న తీరు పై బాధితులు ఆగ్రహం వ్యక్తమవుతోంది.

**3రాజకీయ జోక్యం**

ఈ మొత్తం వ్యవహారంలో రాజకీయ జోక్యం కూడా ఉందనే ఆరోపణలు హాట్ టాపిక్ గా మారాయి. జిల్లాలోని ఓ మండలంలో ఓ గ్రామ సర్పంచ్ తాను జిల్లా మంత్రికి అత్యంత సన్నిహితుడి నంటూ రెవెన్యూ వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని, భూ లావాదేవీల్లో ఒత్తిడి తెస్తున్నారని ప్రచారం జరుగుతోంది. గతంలో మంత్రే స్వయంగా ఆ సర్పంచ్ ను మందలించినా తీరు మారలేదని స్థానికులు చెబుతున్నారు. ఈ ఆరోపణల పై పెద్దపల్లి కలెక్టర్, ప్రభుత్వం స్పందించి సమగ్ర విచారణ చేసి, బదిలీల తో కాకుండా తప్పు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



# అడవుల సంరక్షణలో అటవీ అధికారుల పాత్ర కీలకం

**చిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మంచిర్యాల, మహా :** అడవులను రక్షించి పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారుల పాత్ర ఎంతో కీలకమని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మందమర్రి మండలం గాంధారి వనం ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం కార్యక్రమానికి కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శాంతారామ్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ లతో కలిసి హాజరై అటవీ అమరవీరులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల ప్రభావం అటవీ ప్రాంతంపై పడుతుందని చెప్పారు. ఈ క్రమంలో అడవులు, పర్యావరణాన్ని కాపాడడంలో అటవీశాఖ అధికారులు విశిష్ట కృషి చేయాలని సూచించారు. ఆదివాసి గిరిజనుల హక్కులను కాపాడుతూనే అటవీ అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అడవులను రక్షించడం ద్వారా భావితరాలకు సమతుల్య వాతావరణాన్ని అందించడం జరుగుతుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అందించినట్లు అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. అనంతరం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జిల్లా అటవీ అధికారి స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచారు. అటవీశాఖ అధికారులు, సిబ్బంది సైతం రక్తదానం చేశారు. రక్తదానం చేసిన వారికి జిల్లా కలెక్టర్ ధృవపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గణేష్ ఉత్సవాల్లో డీజేకు నో..!

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు..
- డీజే ఆపరేటర్లు, యజమానులకు పోలీసుల హెచ్చరిక

**పెద్దపల్లి మహా :** గోదావరిఖని: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించేందుకు గోదావరిఖని పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం గోదావరిఖని పోలీస్ స్టేషన్ పరిధిలోని డీజే ఆపరేటర్లు, యజమానులతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా గోదావరిఖని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి మాట్లాడుతూ.. గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో డీజే సౌండ్ సిస్టమ్ల వినియోగానికి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. మండప నిర్వాహకులు, భక్తులు ఈ విషయాన్ని గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు. ఉత్సవాల్లో సాధారణ సౌండ్ సిస్టమ్ను మాత్రమే వినియోగించాలని, మైక్ సిస్టమ్ను రాత్రి 10 గంటల వరకు మాత్రమే ఉపయోగించాలని సూచించారు.పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి డీజే సౌండ్ సిస్టమ్లను వినియోగిస్తే సంబంధిత డీజే ఆపరేటర్లు, యజమానులతో పాటు మండప నిర్వాహకులపై కూడా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్పెక్టర్ హెచ్చరించారు. నిబంధనల ఉల్లంఘనకు అవకాశం లేకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీజే ఆపరేటర్లు, యజమానులను బైండోవర్ చేసినట్లు తెలిపారు.గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో, సంతోషంగా జరుపుకోవాలని, అదే సమయంలో పోలీస్ శాఖ సూచించిన నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి కోరారు. "డీజేకు దూరంగా ఉండి బాజాతో భక్తి భావాన్ని చాటుకుందాం. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహించి గణనాథుని ఆశీర్వాదం పొందుదాం" అని ఇన్స్పెక్టర్ ఆకాంక్షించారు.

# శ్రీ చైతన్య లో ప్రతిభ పురస్కారాలు

**వేములవాడ, మహా:** వేములవాడ పట్టణంలోని శ్రీ చైతన్య రెండవ బ్రాంచిలో శుక్రవారం ప్రతిభ పురస్కారాలు నిర్వహించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికలలో విద్యార్థుల ప్రతిభ,నాయకత్వ లక్షణాలను పరిగణలోని తీసుకొని పలువురు విదార్థులను ఎంపిక చేశారు.అనంతరం నిర్వహించిన నాలుగు సభల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు .ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ చిన్నతనం నుండే నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని అన్నారు.పోటీతత్వం ఉంటే భవిష్యత్తు బాగుంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏ జి ఎం అనిల్, ప్రిసిపల్స్ మమత, సుదేశీ కుమారి,పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# సన్న వడ్ల బోనస్ నమోదు గడువు పొడిగింపు

- సెప్టెంబర్ 17 వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి.
- పాలకుర్తి మండలంలో ఇప్పటి-వరకు 20 శాతం డిజిటల్ పంట నమోదు పూర్తి



పాలకుర్తి,11 సెప్టెంబర్ మహా పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలంలో తెలంగాణ ప్రభుత్వం వానాకాలం-2026 సీజన్‌లో సన్న వడ్లు సాగు చేసిన రైతులకు ప్రకటించిన క్వింటాలుకు రూ.500 బోనస్ పొందేందుకు ఆన్‌లైన్ నమోదు గడువును సెప్టెంబర్ 17, 2026 వరకు పొడిగించినట్లు పాలకుర్తి మండల వ్యవసాయాధికారి తెలిపారు. మండలంలోని రైతులందరూ గడువులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.ప్రభుత్వం సన్న వడ్లకు సంబంధించి BPT5204 సాంబ మసూరి, RNR15048 తెలంగాణ సోనా, HMT సోనా, జై శ్రీరామ్, KNM 1638, WGL44, KNM7715 రకాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు.విత్తనాలను దుకాణాల్లో కొనుగోలు చేసిన రైతులు అదే విత్తన దుకాణం వద్ద నమోదు చేసుకోవాలని, సొంత విత్తనాలు వినియోగించిన రైతులు స్వీయ ధృవీకరణ పత్రం, పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకుని సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులను సంప్రదించాలని సూచించారు.అదేవిధంగా వానాకాలం-2026 సీజన్‌కు సంబంధించి డిజిటల్ పంట సర్వే ఆన్‌లైన్ పంట నమోదు ప్రతి గ్రామంలో నియమించిన వాలంటీర్ల ద్వారా కొనసాగుతోందని తెలిపారు. పాలకుర్తి మండలంలో ఇప్పటివరకు సుమారు 20 శాతం పంట నమోదు ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. శుక్రవారం పాలకుర్తి, కుక్కలగూడూరు గ్రామాల్లో వ్యవసాయాధికారి పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు. సొంత విత్తనాలు వినియోగించిన రైతుల నమోదు వివరాలను పరిశీలించి, రైతులు మరియు AEOలకు పలు సూచనలు చేశారు. డిజిటల్ పంట సర్వే వివరాల ఆధారంగానే ప్రభుత్వం పంట ఉత్పత్తుల కొనుగోళ్లతో పాటు రైతుభరోసా, సన్న వడ్ల బోనస్ చెల్లిస్తుందని వ్యవసాయాధికారి తెలిపారు. పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకోని రైతులకు రైతుభరోసా, బోనస్ అందే అవకాశం ఉండదని స్పష్టం చేశారు. కావున పాలకుర్తి మండలంలోని రైతులందరూ సన్న వడ్ల బోనస్ నమోదు, డిజిటల్ పంట నమోదు రెండింటినీ గడువులోగా పూర్తి చేసుకుని ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.



# పంచాయతీల ఆదాయం బ్యాంకు ఖాతాల్లోనే జమకు సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు

**పాలకుర్తిలో సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో ఘనంగా పాలాభిషేకం.**

పాలకుర్తి 11 సెప్టెంబర్ మహా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని ట్రెజరీలో జమ చేయకుండా,పంచాయతీల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేసుకునే సదుపాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన సందర్భంగా పాలకుర్తి మండల సర్పంచుల ఫోరం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క,జిల్లా మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు,అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, రామగుండం ఎమ్మెల్యే, రాజ్ ఠాకూర్ మక్కాన్ సింగ్ సర్పంచుల ఫోరం సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.గ్రామ పంచాయతీలకు వచ్చే ఆదాయాన్ని స్థానిక అవసరాలకు వినియోగించుకునేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం గ్రామాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని వారు పేర్కొన్నారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచుల ఫోరం సభ్యులు, కాంగ్రెస్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

# "తనిఖీల్లోనూ 'ఎంపిక'.. కొన్ని షాపులకే అధికారుల దృష్టి!?"

**మిగతా దుకాణాలపై పర్యవేక్షణ ఏది..?**

**పెద్దపల్లి, మహా :** పెద్దపల్లి జిల్లా మండలలో మండల వ్యవసాయ అధికారాలు నిర్వహిస్తున్న తనిఖీలపై స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నామమాత్రంగా మాత్రమే తనిఖీలు నిర్వహిస్తున్నారని, కొన్ని ఎంపిక చేసిన దుకాణాలకే పరిమితమవుతున్నాయని రైతులు, వ్యాపార వర్గాల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి.వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయ కేంద్రాల్లో నిబంధనల అమలు, నాణ్యత ప్రమాణాల పరిశీలన కోసం మండల వ్యవసాయ అధికారి తరచూ తనిఖీలు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం జరుగుతున్న తనిఖీలు పూర్తిస్థాయిలో లేవని పలువురు అభిప్రాయపడుతున్నారు. చిన్న తరహా షాపులకు తనిఖీలుకు పరిమితమవుతున్నారు తప్ప పెద్ద డీలర్ల షాపులపై కన్నెత్తి చూడని అధికార యంత్రాంగం అని విమర్శలు వస్తున్నాయి. కొన్ని షాపులను మాత్రమే లక్ష్యంగా చేసుకుని తనిఖీలు నిర్వహిస్తుండగా, మరి కొన్ని దుకాణాలను పూర్తిగా విస్మరిస్తున్నారని స్థానిక వ్యాపారులు ఆరోపిస్తున్నారు. దీంతో తనిఖీల్లో పారదర్శకత లోపించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అన్ని దుకాణాలపై సమానంగా, నిష్పక్షపాతంగా తనిఖీలు నిర్వహించాలని రైతులు, వ్యాపారులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.అధికారులు ఈ ఆరోపణలపై స్పందించి, పూర్తి స్థాయి తనిఖీలు చేపట్టి, వ్యవసాయ రంగంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



# కులం లెక్క తేలాల్సిందే!

- జనగణనలో ఓబీసీలకు చోటివ్వాలి.. కరీంనగర్‌లో బీసీల ధర్మ పోరాట దీక్ష

**కరీంనగర్ మహా, సెప్టెంబర్ 11:** లెక్కల్లో కనిపించని వర్గానికి హక్కులు ఎలా దక్కుతాయి? జనాభాలో తమ వాటా ఎంతన్నది తేలకుండా సామాజిక న్యాయానికి సరైన ప్రాతిపదిక ఎలా ఏర్పడుతుంది? అన్న ప్రశ్నలతో బీసీలు మరోసారి ఉద్యమ బాట పట్టారు. రాబోయే జనగణనలో ఓబీసీల కులగణన చేపట్టి, ప్రతి కులానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ కరీంనగర్‌లో బీసీల ధర్మ పోరాట దీక్ష చేపట్టారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ఎదుట బీసీ సంక్షేమ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ఈ దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగుల కనకయ్య గౌడ్ మాట్లాడుతూ.. దేశంలో చేపట్టే జనగణనలో ఓబీసీల కులగణన నిర్వహిస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హామీ ఇచ్చిందని, ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

**ప్రతి కులానికి ప్రత్యేక కోడ్ ఇవ్వాలి**

జనగణనలో ఓబీసీల ప్రతి కులాన్ని ప్రత్యేకంగా నమోదు చేయడంతో పాటు ప్రతి కులానికి ఒక యూనిక్ కోడ్ కేటాయించాలని కనకయ్య గౌడ్ కోరారు. కులగణన ద్వారా బీసీల వాస్తవ జనాభా, వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయని అన్నారు. ఆ గణాంకాల ఆధారంగానే భవిష్యత్‌లో సంక్షేమ పథకాలు, రిజర్వేషన్లు, అభివృద్ధి కార్యక్రమాలకు మరింత సమర్థవంతమైన విధానాలు రూపొందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో జంతువుల సంఖ్యకు సైతం లెక్కలు తీస్తున్నారని, అయితే దేశ జనాభాలో గణనీయమైన భాగంగా ఉన్న ఓబీసీల కులాల వారీగా ఇప్పటికీ సమగ్ర లెక్కలు లేకపోవడం బాధాకరమన్నారు. బీసీల సంఖ్య తేలితేనే వారి హక్కులు, వాటా, ప్రాతినిధ్యంపై స్పష్టత వస్తుందని అన్నారు.

**హామీ నిలబెట్టుకోవాలి**

ఓబీసీ కులగణన విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కులగణన చేపట్టని పక్షంలో తమ ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కేంద్ర ప్రభుత్వంపై మాత్రమే కాకుండా బీజేపీ పార్టీపై కూడా కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షకు కార్పొరేటర్లు గుగ్గిళ్ల జయశ్రీ, మాజీ కార్పొరేటర్లు నాంపల్లి శ్రీనివాస్, గందే మాధవి, తోట రాములు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రంగు సంపత్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాచమల్ల రాజు, విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేష్ చారి, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు మాదాసు సంజీవ్, రాష్ట్ర కార్యదర్శి జి.ఎస్. ఆనంద్, మహిళా సంఘం మాజీ అధ్యక్షురాలు ఐల ప్రసన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ సంతోషి, జిల్లా ఉపాధ్యక్షురాలు వీరగోని వరలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు మంతెన కిరణ్, ఎడ్ల సురేందర్, పెంట శ్రీనివాస్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గజే ప్రజ్యోత్, బియ్యని తిరుపతి, దుంపటపల్లి మురళి, రాజ్‌కుమార్, బండారి మల్లయ్య, దిలీప్, తిప్పరపు శ్రీనివాస్, సుధాకర్, ఆకుల సురేష్, ఆశిష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# అల్ట్రాటెక్ యాజమాన్యానికి డిమాండ్ నోటీసు.

- కాంట్రాక్ట్ కార్మికుల హక్కులు పరిష్కరించాలి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కౌశిక హరి.
- స్థానిక లారీలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరిక.

పాలకుర్తి 11 సెప్టెంబర్ మహా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం పాలకుర్తి మండలంలో బసంత నగర్ అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు, హక్కులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అల్ట్రాటెక్ కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి ఆధ్వర్యంలో గురువారం అల్ట్రాటెక్ యాజమాన్యానికి డిమాండ్ నోటీసు అందజేశారు. కర్మాగార అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ పార్థసారథికి ఈ నోటీసును అందజేశారు.ఈ సందర్భంగా కార్మికుల సమస్యల పరిష్కారానికి పలు డిమాండ్లను సంఘం నాయకులు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. 250 మంది కాంట్రాక్ట్ కార్మికులకు కాంట్రాక్ట్ బేసిక్‌లు అమలు చేయాలని, సుమారు 400 మంది కార్మికులకు అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్ కేటగిరీల ప్రకారం రేట్లు అమలు చేయాలని కోరారు. అలాగే లోడింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల క్వార్టర్లలో నివసించే కాంట్రాక్ట్ కార్మికులకు నెలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించాలని, ఈఎస్ఐ వైద్య బీమాలో తల్లిదండ్రులను కూడా చేర్చడంతో పాటు వైద్య బీమా పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని కోరారు. లోడింగ్ కార్మికులకు టన్నేజీపై చెల్లింపులను రూ.50కు, ప్యాకర్లకు రూ.50కు పెంచాలని, డస్ట్ అలవెన్స్ అందించాలని డిమాండ్ చేశారు.జె. టైప్ క్వార్టర్ల ముందు షెడ్లు ఏర్పాటు చేయాలని, ఎల్ఎంఈ క్వార్టర్లలో 50 మంది కార్మికులకు కేటాయింపులు చేయాలని, క్వార్టర్లలో నివసించే కార్మికులకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించాలని నోటీసులో పేర్కొన్నారు.అనంతరం కౌశిక హరి మాట్లాడుతూ కర్మాగారం పరిధిలోని స్థానిక లారీ అసోసియేషన్‌కు చెందిన వాహనాలకు యాజమాన్యం తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని ఆరోపించారు. స్థానిక వాహనాలను పక్కనపెట్టి బయట బండ్లు, డీలర్ల వాహనాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. యాజమాన్యం ఈ విధానాన్ని మార్చుకోకపోతే కర్మాగారం వద్ద తీవ్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని సతీష్‌గౌడ్, కండె స్వామి, సంఘం నాయకులు తీగల తిరుపతి, వెంకటేష్, ముల్కనూర్ శ్రీధర్, సాధిక్ పాషా, పూసల ప్రసాద్, బైరి రామకృష్ణ, కొండపల్క రవి, ఫ్లైయస్ ట్యాంకర్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి నాగరాజు, యునుస్ లోకల్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మేకల సదానందం, దాసరి శ్రీనివాస్, చంద్ర మోహన్, గాలిపెల్లి వెంకటస్వామి, రాయపోషం, నేరువట్ల సతీష్, సంకరి కుమార్, రంజిత్, గన్నెవరపు సాయికుమార్‌తో పాటు అధిక సంఖ్యలో కార్మికులు, లారీ డ్రైవర్లు, ఓనర్లు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

**ప్రజలకు మరింత పారదర్శకంగా రేషన్ సేవలు. సర్పంచి పెద్దపల్లి తిరుమల.**

పాలకుర్తి 11 సెప్టెంబర్ మహా పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ పాలకుర్తి మండలంలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు పాలకుర్తి గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి మండల అధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ గౌడ్ మరియు సర్పంచ్ పెద్దపల్లి తిరుమల హాజరై లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ప్రజలకు మరింత సులభంగా, పారదర్శకంగా రేషన్ సేవలు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులను అందిస్తోందని నాయకులు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులో క్యూఆర్ కోడ్‌తో పాటు ఆధునిక భద్రతా సదుపాయాలు ఉండటంతో రేషన్ సేవలను మరింత సులభంగా పొందేందుకు వీలు కలుగుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యం

**రాజేంద్రనగర్, మహా:** స్థానిక సమస్యల పరిష్కారానికి నూతన కాంగ్రెస్ కార్యవర్గం సమన్వయంతో పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి సూచించారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని నూతన అధ్యక్ష, కార్యదర్శులతో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సూచించారు. అనంతరం పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చల్లా నర్సింహారెడ్డి సమీక్షించారు. సమావేశంలో నూతన అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# అబాసుపాలౌవుతున్న ఆర్టీఐ

- **వివరాలకోసం లక్షన్నర డిడి చెల్లించాలని నోటీసులు.**
- **కొంత సమాచారం దొరకదని ఒప్పుకున్న అధికారులు.**
- **ఉన్నతాధికారులను కలిసిన బాధితులు.**

**దమ్మపేట ,మహా :** రెవిన్యూ శాఖలో ఏ అధికారి వచ్చినా ఒరిగేదేమీ లేదని మండల రైతులు ఆవేదన చెందుతున్నారు. తమ సాగు భూములు కోల్పోయిన రైతులు కొందరు అధికారికంగా వివరాలను సేకరించే క్రమంలో బాగా నిరాశకు గురైన రైతు స్థానిక మండల కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 ను ఉపయోగించి , తన హక్కులను తెలుసుకునేందుకు ప్రయత్నించిన క్రమంలో ఏకంగా ఆర్టీఐ నిమిత్తం లక్షన్నర రూపాయలు డిడి చెల్లిస్తే ,తగిన వివరాలు ఇవ్వగలుగుతామని , అందులో కూడా మీరు అడిగిన కొన్ని ప్రశ్నలకు సమాధానం మా దగ్గర లేదని నోటీసులో పేర్కొనడం పట్ల ఆ రైతు విస్మయానికి గురయ్యారు. వివరాలు పరిశీలిస్తే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ,దమ్మపేట మండలంలో 21రెవిన్యూ గ్రామాల్లో 20 రెవిన్యూ గ్రామాలు ఏజెన్సీ ప్రాంతానికి చెందినవే. ఒక్క మండల కేంద్రమైన దమ్మపేట ఒక్కటే ఏజెన్సీ తో సంబంధం లేకుండా జనరల్ గా ఉంది. ఐతే సదరు రైతు అడిగిన సమాచారం ఏమంటే ...2019 నుండి నేటి వరకు పైన సూచించిన 21రెవిన్యూ గ్రామాల్లో 1/70 కి విరుద్దంగా జరిగిన అక్రమ భూ బదలాయింపు ల వివరాలు ,అక్రమ వారసత్వ వివరాలు , గిరిజనేతరుల మద్యన జరిగిన పాస్ బుక్స్ వివరాలు కోరుతూ గత నెల 13న ధరఖాస్తు చేసియున్నారు. లక్షన్నర డిడి కడితే ఎన్ని పేజీల వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

**రైతు అడిగిన సమాచారాన్ని జిరాక్స్ ల రూపంలో ఇవ్వాలంటే 2019 నుండి 2026 వరకు**

అవసరమైన వివరాలను అందించేందుకు ఎన్ని వేల కాపీలు తీయాల్సి ఉంటుంది ,ఎంతమేరకు ఖర్చు అవుతుందో అనే వివరాలను స్పష్టంగా తెలపకుండా ఏకంగా లక్షన్నర డిడి చెల్లించాలంటే ఏ రైతైనా ఖంగుతినక ఏమౌతారని రైతు అయోమయంలో పడ్డారు. వాస్తవానికి 75 వేల జిరాక్స్ కాపీలను అందజేయాలంటేనే లక్షన్నర వరకు ఖర్చు ఉండొచ్చు. అన్ని పేజీలలో సమాచారం ఉంటుందా...అనే అనుమానాలు రైతులకు కలుగుతున్నాయి.2019 నుండి ఏజెన్సీ లో ప్రొహిబిషన్ నుండి నాన్ ప్రొహిబిషన్ లకు మార్పిడి చేసిన వివరాలు అడిగితే ,అటువంటి లావాదేవీలు ఏవీ జరగలేదనడం హాస్యాస్పదంగా ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.2019 నుండి గిరిజనేతరుల కు సంబందించిన అసైన్డ్ భూములకు పట్టా పాస్ బుక్ లు చేశారా ..? అనే దానికి సమాధానమిస్తూ అటువంటి లావాదేవీలు ఏమీ జరగలేదనడం హాస్యాస్పదంగా ఉందని రైతులు ఆవేధన చెందారు. అన్నింటికీ మించిన ఉదాంతమేమిటంటే..1970 నుండి స్వతంత్ర సమరయోధులకు ఇచ్చిన పట్టా భూముల వివరాలు ,లేదా ప్రస్తుతం పట్టా భూముల్లో ఉన్న స్వతంత్ర సమరయోధుల వివరాల జాబితా అడిగిన క్రమంలో ,సమాదానం గా అట్టి వివరాలు ఈ కార్యాలయం నందు లభించవనడం ఎంత వరకు సమంజసమో అధికారుల విజ్ఞతకే రైతులు వదిలిన పరిస్థితి.

1/70 పరిదిలో ఏజెన్సీ గ్రామాల్లో గిరిజనేతరుల కు ఉన్న పట్టా భూములకు 13బి ,అంటే వారసత్వంగా సంక్రమించిన పట్టాల వివరాల జాబితా ను తెలపమనగా , అందుకు సమాదానం ఉండదని బదులు ఇవ్వడం సబబేనా అంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.2019 నుండి గిరిజనేతరులకు 1/70 పరిదిలో ఇచ్చిన కుటుంబ వారసత్వ పట్టాల వివరాలు , ఫ్యామిలీ సర్టిఫికేట్ ల వివరాలు అడిగినా , కార్యాలయంలో లభించవనడం హాస్యాస్పదంగా ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఇన్ని ప్రశ్నలకు సమాధానాలు లేవనప్పుడు లక్షన్నర వరకు ఏ ప్రాసెస్ లో డిడి తీయాలోనంటూ అయోమయానికి గురయ్యామని రైతులు తెలిపారు.

**రైతులపై అధికారుల చిన్నచూపు .**

సమాచారం అడిగిన రైతులపై రెవిన్యూ అధికారులు చిన్నచూపుతో హేళనకు గురిచేయడమే కాకుండా ,అవమానించేలా ప్రవర్తిస్తున్నారని సదరు రైతులు ఆవేధన చెందుతున్నారు. అధికారులు పనిచేసేది వినియోగదారుల కోసమే ఐనప్పుడు బాధిత రైతుల అనుమానాలు తీర్చేందుకే కదా...అంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు.ఏదిఏమైనా ఈ ప్రాంతంలో భూ సమస్యలకు ముఖ్యకారకులు దోపిడీ దళారులు అనేది ఎంతవరకు నిజమో ,అధికారుల అలసత్వం ,నిర్లక్ష్యం ,కూడా కారణమే అని రైతులు మండిపడుతున్నారు.

## పాఠశాల కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- **టియుసిఐ ఆధ్వర్యంలో ఎంఈఓ కి వినతి**

**జూలూరుపాడు, మహా:** పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్ కం స్కావెంజర్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎదులాపురం గోపాల రావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్కావెంజర్స్ జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మటూరి లక్ష్మయ్య, పాఠశాలల కార్మికులతో కలసి ఎంఈఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గోపాలరావు మాట్లాడుతూ కార్మికుల వేతనాలను పాఠశాల చైర్మన్, ఉపాధ్యాయుల ప్రమేయం లేకుండా నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అతి తక్కువ వేతనం చెల్లించడం మూలంగా వారి కుటుంబాలు అర్ధాకలి తో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన విధంగా స్వీపర్ కం స్కావెంజర్లను అనుస్కిల్డ్ కార్మికులుగా గుర్తించి 12,000 వేతనం అందించాలని కోరారు. వారికి పూర్తి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని కోరారు. విషయం తెలుసుకున్న మండల విద్యాశాఖ అధికారి జుంకీలాల్ స్పందిస్తూ, పెండింగ్ లో ఉన్న మూడు నెలల కార్మికుల వేతనాలను త్వరలో విడుదల చేస్తామని వారికి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నూనావత్ లక్ష్మణ్, జమలయ్య, మేరీ, రాజమణి, సౌజన్య, శేషమ్మ, రాధిక, కౌసల్య, సత్యవతి, లక్ష్మీ, ఉమారాణి, రాములమ్మ, శాంతి, సోనీ, తదితరులు పాల్గొన్నారు.



## వేడి నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి

**రాజేంద్రనగర్ మహా ;** మైలార్దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. వేడి నీళ్ళ బకెట్ లో పడి నాలుగేళ్ల బాలిక మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం మైలార్దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రగతి నగర్ లోమహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన కుటుంబం ప్రగతి నగర్‌లో నివాసముంటు ఓ కంపెనీలో పనిచేస్తుంది. తల్లి, పని ముగించుకుని ఇంటికి వచ్చి స్నానం చేయడానికి బకెట్ లో వాటర్ హీటర్ పెట్టి నీళ్లను వేడి చేస్తోంది. అదే సమయంలో తల్లికి ఫోన్ రావడంతో ఫోన్ మాట్లాడుతూ బయటికి వెళ్లింది. అక్కడే ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి మానస ప్రమాదవశాత్తూ వేడి నీళ్ల బకెట్ లో పడింది. నీటి వేడికి తీవ్రంగా గాయపడిన చిన్నారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పాప మృతి చెందింది.



## భూ రికార్డుల నవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు**

మంచిర్యాల, మహా : మంచిర్యాల జిల్లాలో భూ రికార్డుల నవీకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి రాములు అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జి.పి.ఓ., ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే, మండల సర్వేయర్‌లతో నెన్నెల మండలంలోని చిన్న వెంకటాపూర్, పుప్పాలవాని పేట గ్రామాలలో భూ రికార్డుల నవీకరణకు సంబంధించి చేపడుతున్న పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ల్యాండ్ రిజిస్టర్ పూర్తి చేయడం, కొరిలేషన్ స్టేట్‌మెంట్ తయారీ, ల్యాండ్ పార్సెల్ మ్యాపింగ్ ప్రక్రియ నిర్వహణ సమర్థవంతంగా చేపట్టాలని తెలిపారు. భూ రికార్డుల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, పెండింగ్‌లో ఉన్న పనులను సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, భూ రికార్డుల ఖచ్చితత్వం, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

**మణుగూరు, మహా:** గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తూ పోలీసు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మణుగూరు సీఐ నాగబాబు సూచించారు. శుక్రవారం మణుగూరు పోలీస్‌స్టేషన్‌లో మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండపాల వద్ద శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విద్యుత్ అలంకరణలు, భద్రతా చర్యల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఊరేగింపు, నిమజ్జనం సమయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్సైలు నగేష్‌కుమార్, రవూఫ్, వివిధ ప్రాంతాల వినాయక మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

# పదోన్నతితో బాధ్యత మరింత పెరిగింది!

**కరీంనగర్ మహా :** సుమారు 25 ఏళ్ల సుదీర్ఘ సేవ అనంతరం అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొందిన ముగ్గురు వెటర్నరీ డాక్టర్లను కరీంనగర్ జిల్లా వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సైదాపూర్‌లో విధులు నిర్వహించిన డా. రణధీర్‌రెడ్డి, కొత్తపల్లిలో సేవలందించిన డా. శశికాంత్‌రెడ్డి, రామడుగులో పనిచేసిన డా. రామకృష్ణ ఇటీవల అసిస్టెంట్ డైరెక్టర్లుగా పదోన్నతి పొందారు.ఈ సందర్భంగా జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. లింగారెడ్డి మాట్లాడుతూ.. వెటర్నరీ డాక్టర్లుగా ముగ్గురూ తమ విధులను అంకితభావంతో నిర్వహించి, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించారని అభినందించారు. అసిస్టెంట్ డైరెక్టర్లుగా కూడా అదే నిబద్ధతతో పనిచేస్తూ పశుసంవర్ధక శాఖ అభివృద్ధికి మరింతగా కృషి చేయాలని ఆకాంక్షించారు.జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డా. వినోద్‌కుమార్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. వెటర్నరీ డాక్టర్లుగా వారు అందించిన సుదీర్ఘ సేవలను కొనియాడుతూ, వారి సేవలు అభినందనీయమన్నారు.

**సకాలంలో పదోన్నతులు కల్పించాలి**

టీజీవో జిల్లా కార్యదర్శి డా. అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ ముగ్గురు డాక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. వెటర్నరీ డాక్టర్లకు సుమారు 25 ఏళ్ల సుదీర్ఘ సేవ అనంతరం పదోన్నతి లభించడం ఆవేదన కలిగించే అంశమన్నారు. శాఖ పునర్వ్యవస్థీకరణ చేపట్టి, అవసరమైన స్థాయిలో పోస్టులను పెంచడం ద్వారా ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు లభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.పదోన్నతులు ఉద్యోగుల్లో మరింత ఉత్సాహాన్ని నింపడంతో పాటు బాధ్యతాయుతంగా పనిచేసేందుకు స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు.కరీంనగర్ వెటర్నరీ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డా. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ పదోన్నతి పొందిన డాక్టర్లకు అభినందనలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు, కొత్త జిల్లాల ఏర్పాటు అనంతరం పశుసంవర్ధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులు తగిన స్థాయిలో పెరగకపోవడంతో పదోన్నతులు పొందడం కష్టతరంగా మారిందన్నారు. శాఖ పునర్వ్యవస్థీకరణతో పాటు అవసరమైన పోస్టులను పెంచి ఉద్యోగులకు సకాలంలో పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎస్కే చాంద్ పాషా ఎన్నిక

**జూలూరుపాడు, మహా:** ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడిగా వెంగన్నపాలెం గ్రామానికి చెందిన ఎస్కె చాంద్ పాషా ఎన్నికయ్యారు. యాదగిరిగుట్టలో ఈనెల 8,9,10వ తేదీలలో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడవ మహా సభలో ఎంపిక జరిగినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులకు అప్పగించి, యువతకు ఉద్యోగావకాశాలు లేకుండా చేస్తున్నారని, ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం, ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి హామీని నిలబెట్టుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలలో ఉన్న ఖాళీలను భర్తీ చేయాలని చాంద్ పాషా ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంతో నమ్మకంతో రాష్ట్ర సమితి సభ్యుడిగా ఎన్నుకున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా కు కృతజ్ఞతలు తెలిపారు.



## చంద్రపురికాలనీ డివిజన్లో జోనల్ కమిషనర్ పర్యటన

- **సమస్యల పరిష్కారానికై కృషి చేద్దాం**
- **మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఐఏఎస్**

**జవహర్ నగర్, మహా:** సమస్యల పరిష్కారానికై కృషి చేస్తామని, ఓపెన్ నాలాలపట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మల్కాజిగిరి జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్ ఆదేశించారు. చంద్రపురికాలనీ డివిజన్లో జోనల్ కమిషనర్ అధికారులతో కలిసి పర్యటించి శుక్రవారం సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సంచిత్ గంగవర్ మాట్లాడుతూ వర్షాకాలంలో నీరు సాఫీగా వెళ్ళేందుకు తక్షణమే నిధులు కేటాయించి అభివృద్ధిచేస్తామని అన్నారు. అనంతరం న్యూ వెంకటేశ్వరకాలనీ, ముత్తుస్వామికాలనీ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ మాధవాచారి, మాజీ కార్పొరేటర్ బాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల సమస్యలనుపరిష్కరించండి

- **రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి**

**భద్రాద్రి కొత్తగూడెం, మహా:** ధాన్యం మిల్లింగ్ నిలిపివేత బిల్లింగ్ సమయంలో ఏర్పడిన తరుగు ఎఫ్ సి ఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయం తీసుకోవాలని రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ బిల్లింగ్ ప్రక్రియలో ట్రాన్స్‌పోర్ట్ నూకలు ఇతర తరుగుదలలు కలిపి సుమారు 15 శాతం నుండి 20 శాతం వరకు తరుగు వస్తుందని ఈ తరుగుదలను ఫిజికల్ వెరిఫికేషన్ సమయంలో సరైన విధంగా తీసుకోకపోవడం వల్ల రైస్ మిల్లర్స్ కు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని ఈ కారణంగా ప్రస్తుతం మిల్లింగ్ ప్రక్రియ కొనసాగించడం ఆర్థికంగా సాధ్యం కానీ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్సీఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరించకుండా రా రైస్ మాత్రమే ఇవ్వాలని సూచిస్తున్నప్పటికీ మిల్లులకు కేటాయించబడుతున్న ధాన్యం రా రైస్ తయారీకి అనుకూలంగా లేకపోవడం వల్ల దానిని రా రైస్ గా మిల్లింగ్ చేసి సరఫరా చేయటం సాధ్యం కాని పని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పై సమస్యలకు తగిన పరిష్కారం లభించే వరకు మిల్లింగ్ కార్యక్రమాలు నిలిపివేయాలని జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. సమస్యలపై సానుకూలంగా పరిశీలించి రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను తగిన పరిష్కారం చూపటంతో పాటు ఎఫ్ సి ఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణ మిల్లింగ్ కు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించే విధంగా అధికారుల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జుగల్ కిషోర్ ఖండేల్వాల్, సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, ట్రెజరర్ పల్లపోతు శ్రీనివాసు, వెంకటేశ్వర రెడ్డి, కంచర్ల శ్రీనివాసు జిల్లా రైస్ మిల్లు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.





## ఖరీఫ్ ధాన్యం సేకరణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

**అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** రాబోయే ఖరీఫ్ 202627 ధాన్యం సేకరణ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) చంద్రా రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని తన ఛాంబర్‌లో ఖరీఫ్ ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... అక్టోబర్ 1వ తేదీ నాటికి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన మౌలిక వసతులు, తాగునీరు, ఇతర సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలని, కనీస మద్దతు ధర (ఎం ఎస్ పి), ధాన్యం నాణ్యత ప్రమాణాలు, కొనుగోలు విధానానికి సంబంధించిన వివరాలను స్పష్టంగా ప్రదర్శించేలా బ్యానర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ అధికారులు ప్రభుత్వం గుర్తించిన సన్న రకం ధాన్యం వివరాలను పోర్టల్‌లో ఖచ్చితంగా నమోదు చేసి, సంబంధిత కొనుగోలు కేంద్రాలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను ఎటువంటి జాప్యం లేకుండా ఏర్పాటు చేయాలని తెలిపారు. డి ఆర్ డి ఓ, సహకార శాఖలు సెప్టెంబర్ 30వ తేదీలోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి కేంద్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిర్దేశించిన 16 మౌలిక సదుపాయాల ప్రమాణాలు తప్పనిసరిగా అమలయ్యేలా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి సంబంధించి స్థానిక ప్రజాప్రతినిధులతో ముందస్తు సమన్వయం చేసుకొని, ప్రారంభంలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ధాన్యం కొనుగోలు అనంతరం రైస్ మిల్లులకు తరలించేందుకు అవసరమైన హమాలీలు, లారీలను ముందుగానే అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిబంధనలు, ధాన్యం నాణ్యత ప్రమాణాలు, గ్రేడింగ్ తదితర అంశాలను కచ్చితంగా పాటించాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని సూచించారు. ధాన్యం సేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా సివిల్ సప్లయ్ అధికారి వనజాత, ఇంచార్జి డిఎం సివిల్ సప్లయ్ స్వప్న, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి మహమ్మద్ రియజుద్దీన్, డి.సి.సి.ఓ సుధాకర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## 13 న భూమి పూజ కార్యక్రమానికి రానున్న సీఎం

- **ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే బండారి, ఉప్పల్ జెడ్ సి రాధిక గుప్తా**
- **30 కోట్ల వ్యయంతో ఆత్మగౌరవ భవనం**
- **భారీ ఏర్పాట్లు చేస్తున్న ఆర్యవైశ్య మహాసభ**

**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ భగాయత్ లో ఈనెల 13న రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటున్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమాన్ని కాంక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉప్పల్ బగాయత్ లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దాదాపు 30 కోట్ల రూపాయల వ్యయంతో ఆత్మగౌరవ భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. గతవారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు బెలిదే రమేష్‌గుప్తా, బచ్చు నగేష్‌గుప్తాల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు అమరావతి లక్ష్మీనారాయణ హాజరై ఈనెల 13న ఉప్పల్ భగయత్ లో నిర్వహించే భూమి పూజ కార్యక్రమానికి రాష్ట్రంలోని ఆర్యవైశ్యులు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తమ జిల్లాలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఆత్మగౌరవ భవన నిర్మాణం జరగడం ఎంతో గర్వంగా ఉందని మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్ష కార్యదర్శులు హర్షం వ్యక్తం చేశారు. మేడ్చల్ జిల్లా నుంచి సుమారు ఐదువేల మంది ఆర్యవైశ్యుల తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈనెల 13న ఉదయం ఎనిమిది గంటలకు భూమి పూజ స్థలంలో శ్రీనివాస కళ్యాణం నిర్వహిస్తున్నామని ఆసక్తి ఉన్న దంపతులు పాల్గొనవచ్చని వారు సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూమి పూజ కార్యక్రమానికి హాజరవుతున్న సందర్భంగా ఉప్పల్ బగాయత్ లో జరుగుతున్న ఏర్పాట్లను శుక్రవారం ఉదయం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఎం ఎం సి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాలు పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆర్యవైశ్య మహాసభ నిర్వాహకులకు వారు సూచించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ఆర్యవైశ్యుల ఐక్యతను చాటుకోవాలని నిర్వాహకులు కోరారు.





# శిల్ప నగర్ యూటర్న్‌ను తక్షణమే పునరుద్ధరించాలి

- **కాలనీలవాసుల మొర**

**కుషాయిగూడ, మహా:** నాగారం శిల్పానగర్ కాలనీ. యూటర్న్ మూసి వేయడంతో గత నెల రోజులుగా ప్రజలు చుట్టుపక్కల కాలనీల వాసులు అనేకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ట్రాఫిక్ పోలీసులు నిబంధనల పేరిట యూత్ పది పాఠశాలల విద్యార్థులు. బాబు రెడ్డి నగర్. సత్యనారాయణ కాలనీ. ఎం వి ఆర్ కాలనీ. వికాస్ నగర్. పారామౌంట్ రెసిడెన్సి. చంద్రగిరి కాలనీ. హనుమాన్ నగర్. రాంపల్లి ప్రధాన రహదారి వేలాదిమంది ప్రజలు వాహనదారులు. పాదచారులు అనేకముగా గత నెల రోజుల గా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూటర్న్ కోసం కిలోమీటర్ దూరం వెళ్లి యూటర్న్ వేసుకోవాల్సిన పరిస్థితి దాపురించింది. నాగారం డివిజన్ కు చెందిన ప్రజలు. చుట్టుపక్కల కాలనీలవాసులు ట్రాఫిక్ డిసిపి రాహుల్ రెడ్డికి వెళ్లి యూటర్న్ ను మూసివేసిన దానిని తక్షణమే పునరుద్ధరించాలని మొరపెట్టుకున్నారు. రెండు రోజుల్లో మూసివేసిన యూటర్న్ పునరుద్ధరిస్తామని ఆందోళనకారులకు హామీ ఇచ్చినప్పటికీ ఆ హామీని ఇంత వరకు నెరవేరలేదు. ఇప్పటికైనా యూటర్న్ విషయంలో ట్రాఫిక్ పోలీసులు మానవత దృక్పథంతో ఆలోచించాలని నాగారం చుట్టుపక్కల కాలనీ వాసులు మొరపెట్టుకుంటున్నారు. ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు రోడ్డు దాటాలన్న భయపడుతున్నారు. కిలోమీటర్ దూరం న ఉండడంవల్ల ఇబ్బందులు ఆగచాట్లు ఎదుర్కొంటున్నామని వాహనదారులు. పాఠశాలల విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మూసివేసిన నాగారం శిల్ప నగర్ యూటర్న్ తక్షణమే పునరుద్ధరించాలని లేనిచో ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

# ప్రగ్యా నగ్రా.. నీలిరంగు అందాల మెరుపు

**హైదరాబాద్, మహా:** నటి ప్రగ్యా నగ్రా తన అందం, స్టైల్‌తో మరోసారి అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా స్టూడియోలో నిర్వహించిన ఫొటో షూట్‌లో ప్రగ్యా నగ్రా రాయల్ బ్లూ రంగు మెరిసే సీక్విన్డ్ టాప్, అదే రంగులో డిజైన్ చేసిన డ్రేప్డ్ స్కర్ట్ ధరించి ఫొటోలకు పోజులిచ్చింది. చేతులను పైకి ఎత్తి ఎంతో గ్రేస్‌ఫుల్‌గా ఇచ్చిన పోజులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. డైమండ్ ఆభరణాలతో తన లుక్‌ను మరింత అందంగా తీర్చిదిద్దుకుంది. బ్రౌన్ కలర్ బ్యాక్‌డ్రాప్‌లో వెచ్చని స్టూడియో లైటింగ్ మధ్య ప్రగ్యా లుక్ ఎంతో ఎలిగెంట్‌గా కనిపించింది. 998 డిసెంబర్ 14న హర్యానాలోని అంబాలాలో పంజాబీ కుటుంబంలో ప్రగ్యా నగ్రా జన్మించింది. ఢిల్లీలో ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తూనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. కెరీర్ ప్రారంభంలోనే పలు ప్రముఖ బ్రాండ్లకు సంబంధించిన వందకు పైగా కమర్షియల్ ప్రకటనల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఆ తర్వాత నటనపై ఆసక్తితో చెన్నైకి వెళ్లి సినీ రంగంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టింది. 2022లో 'వరలారు ముక్కియం' అనే తమిళ రొమాంటిక్ కామెడీ చిత్రం ద్వారా వెండితెరకు పరిచయమైంది. ఈ సినిమాలో జీవా సరసన జమున పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. తొలి సినిమాతోనే తన నటనతో గుర్తింపు తెచ్చుకున్న ప్రగ్యాకు వరుస అవకాశాలు లభించాయి. 2023లో మలయాళంలో తెరకెక్కిన 'నదికలిల్ సుందరి యమున' సినిమాలో యమున పాత్రను పోషించింది. అదే ఏడాది 'N4' చిత్రంలోనూ కనిపించింది. అనంతరం తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టిన ప్రగ్యా నగ్రా.. 2024లో వచ్చిన 'లగ్గం' సినిమాలో మానస పాత్రలో నటించింది. ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైంది. తమిళం, మలయాళం, తెలుగు భాషల్లో వరుస అవకాశాలు అందుకుంటూ ప్రగ్యా తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది. 2025లో 'బేబీ & బేబీ' చిత్రంలో నటించగా, ప్రస్తుతం 'ఇదయం మురళి', 'బాంబే పాజిటివ్' వంటి ప్రాజెక్టులతో బిజీగా ఉంది. దక్షిణాది సినీ పరిశ్రమలో విభిన్న భాషల్లో నటిస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్న ప్రగ్యా నగ్రా.. రాబోయే రోజుల్లో మరిన్ని ఆసక్తికరమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. నటనతో పాటు తన గ్లామర్ లుక్‌తోనూ సోషల్ మీడియాలో అభిమానులను ఆకట్టుకుంటోంది.



# అదితి బుధతోకీ.. సాఫ్ట్ లుక్‌లో మెరిసిపోతున్న బ్యూటీ

నటి అదితి బుధతోకీ తన తాజా సోషల్ మీడియా పోస్టుతో అభిమానులను ఆకట్టుకుంటోంది. సింపుల్‌గా, ఎంతో అందంగా కనిపించే సాఫ్ట్-గర్ల్ లుక్‌లో ఆమె ఫొటోలకు పోజులిచ్చింది. పాస్టెల్ రంగులో ఫ్లోరల్ లేస్ టాప్‌ను ధరించిన అదితి.. రఫుల్ క్యాప్డ్ స్లీవ్స్, డిజైన్ చేసిన నెక్‌లైన్‌తో ఆకట్టుకుంది. లేస్ ఫ్యాబ్రిక్ ఆమె లుక్‌కు మరింత రొమాంటిక్, ఎలిగెంట్ టచ్‌ను తీసుకొచ్చింది.అదితి తన జుట్టును సహజంగా వదిలేసి, భుజాలపైకి జాలువారేలా బ్రౌన్ కలర్ వేవ్స్‌తో స్టైల్ చేసింది. మెడలో సింపుల్ గోల్డ్ పెండెంట్ మాత్రమే ధరించి మినిమల్ లుక్‌ను మెయింటైన్ చేసింది. సహజమైన మేకప్‌తో డ్యూయీ స్కిన్, పింక్ చీక్స్, గ్లోసీ లిప్స్‌తో మరింత ఆకర్షణీయంగా కనిపించింది. పచ్చని ప్రకృతి నేపథ్యంలోని ఈ ఫొటోలు ఆమె సహజ అందాన్ని మరింత హైలైట్ చేశాయి.ఫ్యాషన్ ఫొటోషూట్లతో పాటు మ్యూజిక్ వీడియోల ద్వారా కూడా అదితి గుర్తింపు తెచ్చుకుంది. 'తు మేరా నహీ' వంటి మ్యూజిక్ వీడియోల్లో కనిపించిన ఆమె.. సినిమాల్లోనూ తన సత్తా చాటుతోంది. 2018లో విడుదలైన నేపాలీ చిత్రం 'క్రి' ద్వారా హీరోయిన్‌గా మంచి గుర్తింపు పొందింది. అనంతరం 'బాబరీ' చిత్రంలో బిజేత పాత్రలో నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. విభిన్నమైన లుక్స్‌తో పాటు నటనతోనూ అదితి తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తోంది.



## ది ప్యారడైజ్‌పై కొత్త ప్రచార వ్యూహం?

హైదరాబాద్, మహా: నేచురల్ స్టార్ నాని నటిస్తున్న 'ది ప్యారడైజ్' సినిమాపై రోజురోజుకూ ఆసక్తి పెరుగుతోంది. 'దసరా' తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో నాని మరోసారి జతకట్టడంతో ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటివరకు కనిపించని మాస్ లుక్‌లో నాని దర్శనమివ్వనున్నట్లు ప్రచారం జరుగుతోంది. అనిరుధ్ రవిచందర్ అందించిన పాటలు కూడా సినిమాకు మంచి హైప్ తీసుకొచ్చాయి.ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. విడుదల తేదీ విషయంలో ఇక మార్పు ఉండకూడదనే ఉద్దేశంతో పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆగస్టు 6న విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది.అయితే ప్రస్తుతం 'ది ప్యారడైజ్' ట్రైలర్ చుట్టూ ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. భారీ సినిమాలకు సాధారణంగా విడుదలకు ముందు ట్రైలర్‌తో ప్రచారం నిర్వహిస్తారు. కానీ ఈ సినిమాకు ట్రైలర్‌ను విడుదల చేయకుండా నేరుగా థియేటర్లలోకి తీసుకురావాలనే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వినిపిస్తున్నాయి. కథలోని కీలక అంశాలు ముందుగానే బయటపడకుండా ఉండటంతో పాటు, ప్రేక్షకుల్లో ఆసక్తిని మరింత పెంచేందుకు ఈ వ్యూహం ఉపయోగపడే అవకాశం ఉంది.అయితే ట్రైలర్‌ను విడుదల చేస్తారా? లేక ఎలాంటి ముందస్తు రివీల్ లేకుండా సినిమాను థియేటర్లలోకి తీసుకొస్తారా? అనే విషయంపై ఇంకా అధికారిక స్పష్టత రావాల్సి ఉంది. విడుదల సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో మేకర్స్ తీసుకోబోయే నిర్ణయంపై అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది.




## నీబ్ కరోలీ బాబా కథ.. తెలుగులో 'హనుమాన్ అంశ్'

హైదరాబాద్, మహా: ఆధ్యాత్మిక నేపథ్య కథలకు ప్రస్తుతం సినీ ప్రేక్షకుల్లో మంచి ఆదరణ లభిస్తోంది. ఈ నేపథ్యంలో నీబ్ కరోలీ బాబా జీవితాన్ని ఆధారంగా రూపొందిన 'హనుమాన్ అంశ్' చిత్రం తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. విశాల్ చతుర్వేది రచించి దర్శకత్వం వహించిన ఈ సినిమాను తెలుగులో ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సమర్పిస్తుండటంతో ఆసక్తి నెలకొంది. తెలుగు థియేట్రికల్ రిలీజ్ బాధ్యతలను ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ చేపట్టింది. సెప్టెంబర్ 18న ఈ చిత్రాన్ని థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. నీబ్ కరోలీ బాబా జీవితం, ఆయన ఆధ్యాత్మిక భావనలు, భక్తులతో ఆయనకు ఉన్న అనుబంధం వంటి అంశాలను కథలో ప్రధానంగా చూపించినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పలువురు ప్రముఖులు ఆయన బోధనలతో ప్రభావితమైనట్లు ప్రచారం ఉండటంతో ఈ కథపై ప్రత్యేక ఆసక్తి ఏర్పడింది.

ఈ చిత్రంలో శోభిన్ అవ్ సత్యా, విహాన్ శేడ్గే కీలక పాత్రల్లో నటించారు. చందన్ ఆనంద్, పూర్ణిమ తివారీ, ఎ.కె. రాస్తోగి, గులాజన్ పాండే తదితరులు ఇతర పాత్రల్లో కనిపించనున్నారు. స్వంభు మీడియా బ్యానర్‌పై తెరకెక్కిన ఈ సినిమాకు విశాల్ త్రివేది సినిమాటోగ్రఫీ అందించారు. ఆధ్యాత్మికత, భావోద్వేగాలను మేళవించిన ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో సెప్టెంబర్ 18న తేలనుంది.




EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com